11-3Pg7exHMNWJQE.qxd:11-3Pg7exHMNWJQE.qxd 1/1/02 6:26 AM Page 1






## అలిపిరిలో పట్టుబడిన రూ.65లక్షలు ఐటికి అప్పగింత

తిరుమల, మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి: తమిళనాడు చెన్నై నుండి తిరుమలలో చిల్లరనాణేల కోసం వ్యాపారలావాదేవీల్లో భాగంగా తీసుకోస్తున్న భారీ మొత్తంలో నగదును అలిపిరి వద్ద విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. పట్టుకున్న నగదు రూ.65 లక్షలు ఉండటంతో తదుపరి అలిపిరి పోలీసులకు అప్పగించారు. అయితే ఈ నగదును చిల్లర నాణేల మార్పిడి కోసమే తీసుకురావడం పరిపాటని వ్యాపారులు తెలిపారు. ఇదివరకు 10, 15లక్షలు రూపాయలు నగదు తీసుకువచ్చేవారమని, అయితే ఇంత మొత్తంలో ఎలాంటి రశీదులు లేకుండా, ఆధారాలు లేకుండా తీసుకు రావడంతో అనుమానంపై పట్టుకున్నారు. పట్టుకున్న నగదును అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్ విచారణ చేశారు. చెన్నైలో వ్యాపారం చేసుకునే దీపక్ యజమాని, అతను తిరులమలోని ఎస్‌బిఐ నుండి నోట్లు ఇచ్చి చిల్లర నాణేలు తీసుకుపోవడం పరిపాటి. ఇందుకు అతని వ్యాపారులు వెంకటేశ్, నీలమేగం ద్వారా రూ.65 లక్షలు రెండు సంచుల్లో పంపారు. పట్టుబడిన నగదును యజమానికి దీపక్ తిరుపతికి చేరుకుని పోలీసులకు వివరణ ఇవ్వడంతో తదుపరి ఐటి శాఖకు అప్పగించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తరలించడం, నోట్లకు బదులు చిల్లర తీసుకెళ్ళడం పన్ను ఎగవేతనేనని అధికారులు తెలిపారు.

## సిఎంతో జనగణన డైరెక్టర్ భేటీ

- మే 1తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ హౌసింగ్ సెన్సెస్ ప్రక్రియ
- వచ్చే నెల 15 నుంచి స్వీయగణన కార్యక్రమం
- రెండు దశలుగా 2027 జనగణన కార్యక్రమం గురించి సీఎంకు వివరణ ఇచ్చిన జె. నివాస్



**విజయవాడ మార్చి 10,ప్రభాతవార్త ప్రతినిధి:** 2027 జనగణనలో భాగంగా రాష్ట్రంలో ఈ ఏడాది మే 1 తేదీ నుంచి హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ ప్రక్రియ చేపడుతున్నట్టు ఏపీ సెన్సెస్ ఆపరేషన్స్, సిటిజన్ రిజిస్ట్రేషన్స్ డైరెక్టర్ జె. నివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జనాభా లెక్కల ప్రక్రియను రెండు దశలుగా చేపడుతున్నామని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహ గణన (హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్) ప్రక్రియను చేపట్టనున్నట్టు జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. మే 30 తేదీ వరకూ జరిగే ఈ ప్రక్రియలో ఇళ్లలోని పరిస్థితులు, గృహాల్లోని వివిధ సదుపాయాలను, ఆస్తులకు సంబంధించిన వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ 16 తేదీ నుంచి 30 తేదీ వరకూ స్వీయ గణన వెసులుబాటు కల్పించినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. రెండో దశలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. జనగణనలో భాగంగా సామాజిక ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, వలసలు, సంతానానికి సంబంధించిన వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. పూర్తిగా డిజిటల్ విధానంలో తొలిసారి 16వ సెన్సెస్ చేపడుతున్నట్టు ముఖ్యమంత్రికి తెలిపారు. మొబైల్ అప్లికేషన్లు, ప్రత్యేకించిన వెబ్ పోర్టళ్ల ద్వారా ఈ సమాచార సేకరణ జరుగుతుందన్నారు. ఇంటర్నెట్ కనెక్షన్ లేని ప్రాంతాల్లో ఆఫ్ లైన్ లోనూ సమాచార సేకరణ, జనగణన చేపట్టనున్నట్టు తెలియచేశారు. ప్రజలే నేరుగా తమ వివరాలను స్వీయ గణన ద్వారా నమోదు చేసేందుకు పబ్లిక్ పోర్టల్ ను ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. దీని కోసం సెన్సెస్ మేనేజ్మెంట్ మోనిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా నిరంతరం ఈ జనగణన ప్రక్రియను పర్యవేక్షి ంచనున్నట్టు తెలిపారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ కోసం డిజిటల్ సరిహద్దు మ్యాపింగ్ చేయనున్నట్టు వివరించారు. వివరాల నమోదు కోసం 16 భాషల్లో హౌస్ లిస్టింగ్ మొబైల్ యాప్ అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ముఖ్యమంత్రికి తెలియచేశారు. 2027 జనగణన ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ప్రగతి, వికాస్ అనే మస్కట్ లను వినియోగిస్తున్నట్టు రాష్ట్ర సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు.

ఫైల్ఫోటో:ఘంటా విజయకుమార్

## తిరుపతిలో రమాదేవి ఆస్పత్రిలో మృతదేహం అప్పగింతకు లంచం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య... రాజమండ్రిలో విధులు వదిలి రీల్స్ చేస్తున్న ఇద్దరు హెడ్ నర్సుల సస్పెన్షన్

**తిరుపతి,మార్చి 10ప్రభాతవార్త న్యూస్ నెట్‌వర్క్:** తిరుపతిలో ఓ కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యం ఏకంగా ఠాగూర్ చిత్రంలో లీలలు నిజమయ్యేలా మృతదేహానికి డబ్బులు చెల్లించాలంటూ తెల్లవారు జాము నుంచి మృతదేహాన్ని ఇవ్వని ఆసుపత్రి యాజమాన్యం. మరణించిన వ్యక్తి కుటుంబం నుండి డబ్బులు డిమాండ్ చేసిన వైనం సాయం త్రం వెలుగుచూసింది. తిరుపతి సాయిరాం వీధిలోని రమాదేవి హాస్పిటల్ యాజమాన్యం తీరుపై బాధితులు రోడ్డుపైకి చేరారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం జీడిమాకులపల్లికి చెందిన శ్రీనివాస్ యువకుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో తొమ్మిది రోజుల క్రితం ఈ ఆసుపత్రిలో చేరాడు. ఇప్పటి వరకు అతని కుటుంబం నుండి మూడు లక్షల వరకు ఆస్పత్రి యాజమాన్యం వసూలు చేసిందని, చివరకు అతని భార్య, తల్లి పుస్తెల తాకట్టు పెట్టి ఆసుపత్రి ఫీజు చెల్లించారని కుటుంబ సభ్యులు వాపోయారు. ప్రాణాలు కోల్పోయినా ఏమాత్రం మానవత్వం చూపకుండా 45 వేలు రూపాయలు చెల్లించాలంటూ మంగళ వారం ఉదయం నుండి మృతదేహాన్ని ఇవ్వకుండా ఆసుపత్రి యాజమాన్యం ఇబ్బందులు పెట్టిందని ఆరోపించారు. డిఎంహెచ్‌వోకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు.

**ఆ ఆస్పత్రిని వెంటనే సీజ్ చేయండి: ఈశ్వరయ్య**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య తిరుపతి నగరంలో ఉన్న రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను వెంటనే సీజ్ చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ప్రజలకు సేవచేయాల్సిన వారే దోచుకోవడం ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది ఇలా ఉండగా...

**విధుల నిరక్ష్యం పై ఇరువురు హెడ్ నర్సుల సస్పెన్షన్**

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల కు సరైన సేవలు అందించాల్సిన ఇద్దరు నర్సులు విధులను మరిచారు. ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ పోస్ట్ చేయడం పై ఉన్న దృష్టిని ఉద్యోగ బాధ్యతలపై ఉంచడం లేదని తెలుసుకున్న పై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీంతో ఐటెం సాంగ్స్‌కు డాన్స్ వేస్తున్న ఇరువురు హెడ్‌నర్సు లను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై విచారణకు ఆదేశాలు జారీచేశారు. దీనికి సహకరించిన 16 మంది సిబ్బందికి అదికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ రీల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయి వారిపై తగిన చర్యలు తీసుకొనడం కొసమెరుపు. ఉద్యోగులు విధులు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# జగన్ చేసిన అప్పులతో ప్రభుత్వానికి యేటా రూ.71,800 కోట్ల భారం

### రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



గుంటూరు, మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి: సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడమే పనిగా జగన్ ఐదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించాడని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. భారతి సిమెంట్, సాక్షి పత్రికకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పనిచేశాడని ఆరోపించారు. మంగళవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ భారతీ సిమెంట్‌కు లబ్ధి చేకూరే విధంగా సిమెంట్ ధర రూ.3 పెంచి సుమారు రూ.165 కోట్లు ప్రజలపై భారం వేశాడని మండిపడ్డారు. దీంతో భారతీ సిమెంట్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిందన్నారు. జగన్ అసెంబ్లీకి రాకుండా ఇంట్లో ఉంటూ రాష్ట్ర ఆర్థిక రంగంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన అన్ని అవకాశాలను జగన్ వదిలేసి నేడు ప్రభుత్వంపై ఒకటే పనిగా బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు.

**జగన్ ఆర్థిక విధ్వంసానికి సాక్ష్యం కాగ్ నివేదిక:** చంద్రబాబు నాయుడు నాయకత్వానికి రాష్ట్ర ప్రజలు 164 సీట్లు అప్పగించారనే నమ్మకంతోనే కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోందని మంత్రి అన్నారు. వైసిపి ఐదేళ్ల పరిపాలనలో సుమారు 9.70లక్షల కోట్లు అప్పు చేశారని ఆ అప్పు కూటమి ప్రభుత్వం చేసినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ. 81వేల కోట్లు ప్రభుత్వం అప్పు తీసుకుందని కాగ్ నివేదిక ఇస్తే వైసీపీ రూ.87 వేల కోట్లుగా ప్రచారం చేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు అప్పులే కాకుండా ఆస్తులను సృష్టిస్తున్నామని వైసీపీ బాధ్యత రహిత పరిపాలనతో బ్యాంక్ లు అప్పులు ఇవ్వడం మానేశాయన్నారు. పెట్టుబడులు దారులు రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిస్థితిలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాజీ పడటం లేదని తొలి ఏడాదిలో ప్రభుత్వ ఉద్యోగస్థులకు రూ.20వేల కోట్లు చెల్లించామన్నారు. ప్రతీ నెల మొదటి తేదీకే జీతాలు చెల్లిస్తున్నామని చంద్రబాబు నాయుడు నాయకత్వంతో మరల రాష్ట్రంలో విశ్వసనీయత పెరిగిందన్నారు.

**గతం కంటే సంక్షేమానికి 45శాతం అధికంగా ఖర్చు:** జగన్ హయంలో ఐదేళ్లలో అమ్మ ఒడి పథకానికి రూ. 26వేల కోట్లు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సామాజిక పింఛన్లు కోసం జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే కేవలం ఇరవై నెలల్లోనే రూ.58,654 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. రైతులకు జగన్ ఐదేళ్లలో రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తే ఒక్క సంవత్సరంలో రూ. 6300 కోట్లు ఇచ్చామని గతంతో పోల్చితే 45 శాతం వరకు అదనపు నిధులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. పంచా యతీ గ్రాంట్స్, కేంద్ర ప్రభుత్వ పథకాలను జగన్ పక్కదారి పట్టిం చారని ఆయన హయంలో సర్పంచ్‌లు అధికారాలు తీసి ఇంట్లో కూర్చోబెట్టారన్నారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఇప్పుడు అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని జగన్ చూస్తున్నాడని అన్నారు. సాక్షి పత్రిక, టీవీలో నచ్చిన వారిని కూర్చొబెట్టి అసత్య వార్తలను ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని చివరికి అన్నం పెట్టే రైతులను మోసం చేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ఎద్దేవా చేశారు. వైసీపీ హయంలో ధాన్యం అమ్మిన ఆరు నెలలు వరకు డబ్బులు జమా అయ్యేవి కావని నేడు 24 గంటల్లో రైతు అకౌంట్ లో డబ్బులు జమా చేస్తున్నామన్నారు.

**సొంత కంపెనీల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన జగన్:** రాష్ట్రానికి ఆదాయం తీసుకొచ్చి మార్గాలను వదిలేసిన జగన్ తన ఆదాయానికి ఏ మాత్రం డోకా లేకుండా భారతీ సిమెంట్ కు లబ్ధి చేకూర్చారని మంత్రి ఎద్దేవా చేశారు. సిమెంట్ ధర రూ.3 పెంచి రూ.165 కోట్లు ప్రజలపై భారం వేశారని సుమారు భారతీ సిమెంట్ సామర్థం మూడు రెట్లు పెంచాడని అన్నారు. సాక్షి పత్రికకు ప్రకటన రూపంలో రూ.400 కోట్లు ఇచ్చారని ప్రత్యేక జీవోలు తీసుకొచ్చి వాలంటీర్స్, సచివాలయ సిబ్బందికి కేవలం సాక్షి పత్రికలు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నామో ఆదాయ వనరులు కూడా అలానే తీసుకురావాలని, అప్పుడే రాష్ట్ర ఆర్థిక రంగం గాడిలో పడుతుందని అన్నారు. ఐదేళ్లు బటన్ నొక్కడమే పనిగా జగన్ పని చేశారని ఆదాయ వనరులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారుని విమర్శించారు.




## వైద్య సేవల్లో లోపాలుండొద్దు

- అన్ని విభాగాలలో అవసరమైన పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి: జిల్లా కలెక్టర్

నెల్లూరు. మార్చి 10, ప్రభాతవార్త -వైద్యం: ప్రభుత్వ సర్వజన ప్రధాన వైద్యశాలలో లక్ష్యానికి అనుగుణంగా శస్త్ర చికిత్సలను నిర్వహించేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. మంగళవారం నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని లెక్చర్ హాల్‌లో అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ మిమాన్షు శుక్ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్లినికల్, నాన్ క్లినికల్ సంబంధిత విషయాలపై కూలంకుషంగా చర్చించారు ప్రధానంగా ఆసుపత్రిలో నిర్వహించాల్సిన మేజర్ సర్జరీల విషయంలో శాఖల వారీగా జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, చెవి ముక్కు గొంతు, ఆంకాలజీ, గైనకాలజీ, ఆప్తాల్ మాలజీ తదితర శాఖలపై చర్చించి లక్ష్య సాధనలో వెనుకబడి ఉండుటకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన పరికరాలకు కొనుగోలుకు ప్రతిపాదనలను డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వచ్చి వారం రోజుల లోపల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అంతేకాకుండా ఫిజియథెరఫీ, సైక్రియాటిక్ విభాగాలకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని కోరారు. ఏపీ ఎంఎస్ ఐడీసీ వారి ద్వారా ఐసీయూలో ఉన్న బెడ్ల పరిస్థితులను పరిశీలించి అవసరమైతే నూతన బెడ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వజన వైద్యశాలలో సర్జరీల సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాన్ క్లినికల్ వియాలపై చర్చిస్తూ ప్రధానంగా రక్షణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ప్రధాన గేటు వద్దనే అధిక సంఖ్యలో పేషెంట్‌తో పాటు వచ్చే అటెండెంట్‌లను తగ్గించాలని దానికి అనుగుణంగా పోలీసు శాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ సౌజన్యకు సూచించారు. మెయిన్ గేటు వద్ద నుండే జనాలను కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే లోపల కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని తగు విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రి పరిసరాలలో రాత్రి పూట 9 గంటల తదుపరి చీకటి ఎక్కువగా ఆవరించి ఉంటుందని దానిని నివారించేందుకు రానున్న 15 రోజుల లోపల మంచి లైటింగ్‌ను ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రి లోపల అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని అదే విధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పవర్ బ్యాక్ అప్ ను ఉంచాలని అన్నారు. ఆసుపత్రి లోపల టార్చిలతో కానీ మొబైల్ లైటింగ్‌లనువాడడం జరగకూడదని ఆయన అన్నారు. అవసరమైన సిబ్బందిని ప్రత్యక్ష నియామకం ద్వారా కాకుండా సర్దుబాటు ద్వారా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో చెత్త నియంత్రణకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తొలగించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ శాఖ సిబ్బందికి సూచించారు. అంతే కాకుండా కుక్కలు, కోతులు విచ్చలవిడిగా తిరగకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి ఆసుపత్రులు అందిస్తున్న సేవలు, సాధించిన ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎన్ఎస్ అనూష; సూపరింటెండెంట్ కే.మాధవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పరిమళ, ఏడీ ఏడుకొండలు, డాక్టర్ సుజాత, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల డాక్టర్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మడపర్తి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డిటికి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలి

- లేనిపక్షంలో కలిసొచ్చే పార్టీలు ప్రజాసంఘాలతో ఏప్రిల్ 2 నుంచి ప్రభుత్వ పరిపాలన స్తంభింప చేస్తాం
- వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత హెచ్చరిక

అనంతపురం, మార్చి 10 ప్రభాతవార్త బ్యూరో: పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగా ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్ఏ రెన్యూవల్ చేయాలని, అట్లు చేయని పక్షంలో ఏప్రిల్ 2 నుంచి పరిపాలన స్తంభింపజేస్తామని, కలిసి వచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం వైసిపి సమన్వయ కర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పిలో లక్ష పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు సాకే శైలజా నాథ్, విశ్వేశ్వర్ రెడ్డి, జెడ్పి చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, నియోజకవర్గ పరిశీలకులు మహేంద్రరెడ్డి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, కె.వి రమణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ తొలుత అనంతపురం జిల్లాకు వచ్చినప్పుడు గో బ్యాక్ ఆర్డీటీ అంటూ కొందరు వ్యతిరేకించారని, అప్పట్లో తన తండ్రి అనంత వెంకటరెడ్డి ఆర్డీటీకి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు ఆర్డీటీపై మతం ముద్ర వేసి దేశంలోనే లేకుండా చేయాలన్న కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డీటీ సంస్థ అహర్నిశలు కృషి చేసిందన్నారు. దళిత, గిరిజనులకు విద్యను చేరువ చేసిందని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించడం కోసం తొలుత చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది ఆర్డీటీ సంస్థేనని తెలియజేశారు. ప్రభుత్వాలకు స్ఫూర్తినిచ్చేలా ఆర్డీటీ పని చేసిందని తెలిపారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం జిల్లాలో ఉద్యమాలు జరిగితే వాటిని కట్టడి




చేసే ప్రయత్నాలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వంతో పనిచేస్తున్న సంస్థకు అందరూ అండగా ఉండాలని, ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని, ఏప్రిల్ 2వ తేదీలోగా ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పరిపాలన స్తంబింప జేస్తామని ప్రజలు, కలిసొచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి కలెక్టరేట్‌ను దిగ్బందిస్తామని స్పష్టం చేశారు. ఆర్డీటీ విషయంలో ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. చివరకు గ్రామాల్లో అడుగుపెట్టలేని పరిస్థితిని తెచ్చుకోవద్దని తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం గతంలోనే బైక్ ర్యాలీ, పాదయాత్రలు చేశామని, ఇప్పుడు ప్రధాని మోదీకి లక్ష పోస్టుకార్డులు పంపుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి సమన్వయకర్తలు, జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆడిట్ చేసిన సేవలు అపారం అని, ఆర్డిటిని సంరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ లైసెన్స్ వచ్చేవరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మన జీవితాల్లో ఆర్డీటీ ఒక భాగమని, అలాంటి సంస్థను అందరూ కలిసికట్టుగా కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు.




# రైతుల పరిస్థితి అగమ్యగోచరం

### పిసిసి అధ్యక్షురాలు షర్మిల

అమలాపురం, మార్చి10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ లోను,దేశంలో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా వుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కి హాజరైన పి. సి సి అధ్యక్షురాలు షర్మిల మహాత్మా గాంధీ ఉపాధి పథకం పేరు మార్చడం పై బిజెపి కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పార్లమెంట్ లో ఇచ్చిన రిపోర్ట్ ఇందుకు నిదర్శనమని మన దేశ రైతుల అప్పులు రూ30 లక్షల కోట్లని పేర్కొన్నారు.మన రాష్ట్ర రైతుల అప్పులు 3.75 లక్షల కోట్ల రూపాయలని అప్పుల్లో దేశంలోనే రాష్ట్రం రెండో స్థానం గావుందని ప్రకటించారు.దేశ రైతుల అప్పుల్లో మన రాష్ట్ర రైతుల అప్పులు 10 శాతంగా వుందని,రాష్ట్రంలో ప్రతి రైతుకు సగటున 2 నుంచి 7 న్నర లక్షల అప్పు ఉన్నట్లు తెలిపారు.రాష్ట్ర రైతాంగం మొత్తం అప్పుల్లో మునిగిపోయిందని రైతులను అప్పుల్లో ముంచడమేనా చంద్రబాబు వ్యవసాయం లాభసాటి అని తెలిపారు.ఇదేనా రైతు సంక్షేమ ప్రభుత్వం కేంద్రంతో సంబంధం లేకుండా రూ 20 వేలు ఇస్తామని మోసం చేశారని రైతులకు సుఖీభవ కింద ఇస్తున్నది రూ 14 వేలే నని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో 93 లక్షల మంది రైతులంటే, మీరిచ్చింది కేవలం 47 లక్షల మందికే నని కౌలు రైతులకు రాష్ట్రంలో దిక్కులేదని రైతు పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర లేదని షర్మిల విమర్శించారు.రాష్ట్రంలో ఏ పంటకు కనీస మద్దతు ధర అందలేదని ధరల స్థిరీకరణ నిధి పేరుతో మోసమే జరిగిందన్నారు. ముష్టి 500 కోట్లు బడ్జెట్ లో పెట్టి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో కనీసం రైతులకు యూరియా సైతం ఇవ్వలేదని బీజేపీ పార్టీ తో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ అధికార పొత్తు పెట్టుకుంటే,జగన్ మోహన్ రెడ్డి అక్రమ పొత్తు పెట్టుకున్నారని సంచల వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అవ్వడం ఖాయమని మళ్ళీ ఉపాధి హామీకి మహాత్మా గాంధీ పేరు పెడతామని,150 రోజుల పని దినాలు పెంచి 400 రూపాయలు వేతనం ఇస్తామని షర్మిల హామీ ఇచ్చారు.అమలాపురం నియోజకవర్గంలోని బట్నవిల్లి గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో స్థానికులు త్రాగునీటి కొరతపై ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తీవ్రంగా మంచినీటి సమస్య ఉందని, సరైన త్రాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రచ్చబండ కార్యక్రమం జరుగుతుండగానే స్థానికుల సమస్యను గమనించిన వైఎస్ షర్మిల జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అమలాపురం ప్రాంతంలో నెలకొన్న త్రాగునీటి ఎద్దడిపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.సి డబ్ల్యూ ఎస్ సభ్యులు గిడుగు రుద్రరాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, బిఆర్‌కె నాయుడు, అమలాపురం అసెంబ్లీ ఇంచార్జి అయితాబత్తుల సుభాషిణి, ముషిణి రామకృష్ణ, గెడ్డం సురేష్ బాబు, వంటెద్దు బాబీ తదితరులు ఉన్నారు.

### ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్‌కు

## వ్యతిరేకంగా నిరసన

**తిరుపతి,మార్చి 10ప్రభాతవార్త ప్రతినిధి:** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్న ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్‌కు వ్యతిరేకంగా తిరుపతిలో ఎస్పీడిసిఎల్ ఉద్యోగులు సంఘాలు నిరసన తెలిపాయి. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామసమయంలో ఈ నిరసన వ్యక్తం చేసి ఈ బిల్లు అమల్లోకి వస్తే ప్రైవేటీకరణకు దారితీస్తుందన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్ అమల్లోకి వస్తే విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణకు దారితీసే అవకాశం ఉందని, దీని వల్ల ప్రభుత్వ విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితి దెబ్బతినడంతో పాటు వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్ల భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావంపడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

# కట్టుకున్నోడే కాలయముడు..

## అనుమానంతో కడతేర్చాడు.. కథ అల్లాడు

- గంగా భవాని మృతి మిస్టరీ చేదించిన బల్లికురవ పోలీసులు
- నిందితుడు అరెస్ట్

బల్లికురవ, మార్చి 10 ప్రభాతవార్త: క్షణికావేశం, భార్యపై అనుమానం, తాను చేసిన 15 ఏళ్ల కాపురం, తన ఇద్దరు కన్న కూతర్లను కూడా మరిచిపోయేలాగా చేసింది. భార్యను హతమార్చి తాను జైలు ఊచలు లెక్కబెడుతుంటే, తమ కడుపున పుట్టిన పాపానికి ఆ ఆడ బిడ్డలు, తల్లిదండ్రులకు దూరమైన ఎంత నరకయాతన అనుభవిస్తారో అనే తలంపు ఒక్క క్షణం, ఆలోచన వచ్చినా ఇంతటి ఘోరానికి పాల్పడే వాడు కాదు వీరాంజనేయులు. ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన గుంటుపల్లి, గంగా భవానీ మృతి కేసులో మిస్టరీ వీడింది. భర్త గుంటుపల్లి వీరాంజనేయులు తన భార్య గంగా భవానిని తానే కాలువలో తోసి హతమార్చినట్లు మంగళవారం వల్లాపల్లి వీఆర్వో సాయి ప్రసన్న ఎదుట అంగీకరించాడు. వీఆర్వో సాయి ప్రసన్న హంతకుడు వీరాంజనేయులును స్థానిక పోలీసు స్టేషన్లో సంతమాగులూరు సిఐ కాకుమాను వెంకట్రావుకు అప్పగించారు. తమదైన శైలిలో విచారించగా తాను చేసిన ఘోరాన్ని వెళ్ళగక్కాడు. కొణిదెన గ్రామానికి చెందిన కొణిదెనగంగా భవానికి, వీరాంజనేయులకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. బేల్దారి మేస్త్రీగా పనిచేసే వీరాంజనేయులు గత మూడేళ్లుగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో భాగంగానే ఈ నెల 3వ తేదీన గుంటుపల్లి వీరాంజనేయులు, గంగా భవానిలు ఎబిసి 33వ మైలు ఎగువ భాగంలో గొర్రె పిల్లలకు, ఆకు కోసేందుకు వెళ్తే.. మధ్యలో మంచినీరు తాగేందుకు కాలువలో దిగి తన భార్య గల్లంతయినట్లు భర్త వీరాంజనేయులు కథ సృష్టించాడు. ఆ తర్వాత కాలువలో నీటి సరఫరా తగ్గించడం మృతదేహం కోసం తీవ్రంగా శ్రమించిన పోలీసులు 7వ తేదీన మృతదేహాన్ని గుర్తించడం, దర్యాప్తును వేగవంతం చేయడంతో తప్పించుకోలేనని తెలిసి హంతకుడు వీరాంజనేయులు లొంగిపోయాడు.

పోలీసుల విచారణలో గత మూడు సంవత్సరాలుగా తన






భార్యపై పెంచుకున్న అనుమానంతోనే ఆమెను హతమార్చినట్లు వెల్లడించాడు. గతంలో ఘర్షణ పడి ఒకసారి గంగా భవాని కాలు కూడా విరగొట్టాడు. ఇటీవల భార్యపై అనుమానం మరింతగా బలపడడంతో ఆమెను హతమార్చాలని నిర్ణయానికి వచ్చాడు. గత మంగళవారం ఆకు కోసం అనే నెపంతో తాడుతో ఉరివేసి చంపాలనుకున్నాడు. అది కుదరకపోవడంతో బహిర్భూమికి వెళ్లి వస్తున్న గంగా భవానిని కాలువలో తోసి హతమార్చాడు. ఆ తర్వాత కథ అల్లాడు. పోలీసులు తమదైన రీతిలో స్పందించడంతో అసలు విషయాన్ని వెళ్లగక్కాడు. గంగా భవాని సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు మరింత వేగవంతం చేశాడు. వీరాంజనేయులు పొంతన లేని సమాధానాలతో అతనిపై అనుమానపడ్డ ఎస్ఐ వై.నాగరాజు వారం రోజుల వ్యవధిలోనే కట్టుకున్న వాడే కాలయముడు అని గుర్తించి అరెస్టుచేయగలిగారు. వరుసగా పలు కేసులలో నెలకొన్న మిస్టరీని చేధించిన ఎస్ఐ వై.నాగరాజును మండల ప్రజానీకం, అధికార యంత్రాంగం అభినందిస్తున్నారు. హంతకుడు వీరాంజనేయులును అద్దంకి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు.

## వైభవంగా ప్రారంభమైన శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ట, కలశ స్థాపన మహోత్సవాలు

7వ తరువాయి ..

12వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పూర్తి పర్యవేక్షణ, సహకారంతో అత్యంత శోభాయమానంగా సాగుతున్నాయి. మొదటి రోజు ఉదయం 9 గంటల నుండి యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, అఖండ దీపారాధన తదితర విశేష కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, వారి సతీమణి కౌన్సిలర్ పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ తదితరులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పెదపర్తికి చెందిన యాగ బ్రహ్మ, శైవాగమ కిషోర్, ఆగమ భాస్కర యాగకేసరి బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి, శివాచార్య బృందం ఆధ్వర్యంలో ఈ మూడు రోజుల దీక్షా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉదయం జరిగిన పూజా కార్యక్రమాల అనంతరం స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ ఆలయ నిర్మాణ విశేషాలను వివరించారు. నర్సీపట్నం ప్రజలందరి ఇలవేల్పు అయిన నూకాలమ్మ వారి ఆలయ నిర్మాణాన్ని ఆరు సంవత్సరాల క్రితమే ప్రారంభించామని, అప్పట్లో తాను పది లక్షల రూపాయలు డిపాజిట్ చేయగా ప్రభుత్వం 40 లక్షలు మంజూరు చేసిందని, మొత్తం 50 లక్షలతో పనులు మొదలుపెట్టామని తెలిపారు. అయితే గత ప్రభుత్వం ఆలయ నిర్మాణాన్ని అశాస్త్రీయంగా, ఇష్టానుసారంగా సగం చేసి వదిలేసిందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో గుడి నిర్మాణం ఆగిపోయిందని చెప్పి సీఎంఆర్ షాపింగ్ మాల్ వారి వద్ద నుంచి పది లక్షల రూపాయలు తీసుకున్నారని, కానీ ఆ డబ్బులు ఆలయ అకౌంట్‌లో జమ చేయకుండా పక్కదారి పట్టించారని ఆరోపించారు. అమ్మవారి సొమ్ము తిన్నవారు బాగుపడరని ఆయన హెచ్చరించారు. తిరిగి తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేవాదాయ శాఖ మంత్రిగారితో మాట్లాడి మరో 10 లక్షలు డిపాజిట్ చేసి 40 లక్షలు నిధులు తెచ్చామని స్పష్టం చేశారు. అలాగే ఆలయంలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి అదనంగా మరో 25 లక్షల రూపాయలు అవసరమవుతాయని, అందుకోసం ఐదు లక్షలు మళ్లీ డిపాజిట్ చేస్తున్నామని వెల్లడించారు. పది కాలాల పాటు నిలిచిపోయేలా శాస్త్రోక్తంగా అమ్మవారి ప్రతిష్టా కార్యక్రమాలు జరిపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ గురువారం ఉదయం 9.14 నిమిషాలకు యంత్ర విగ్రహ ప్రతిష్టలు, శిఖరం నుండి బూరెలు పోయుట, అన్నదానం తదితర కార్యక్రమాలు జరగనున్నాయని అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు నర్సీపట్నంలోని మొత్తం 20 వార్డుల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పసుపు నీళ్లు, బిందెలతో తరలివచ్చి అమ్మవారికి అభిషేకం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే మార్చి 12 నుంచి 18వ తేదీ వరకు కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు జరుగుతాయని, ఏప్రిల్ 1వ తేదీన మర్రిడమ్మ పండుగను కూడా ఎంతో వైభవంగా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ఈ మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి పునఃప్రతిష్టా మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొరకు శ్రీనివాస్, టిడిపి కౌన్సిలర్లు ముఖ్య నేతలు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జీతాలు ఇవ్వండి మహాప్రభో...

విశాఖపట్నం, మార్చి 10 ప్రభాతవార్త

తమకు నెలల తరబడి జీతాలు లేక కుటుంబ పోషణ కష్టమవుతుందని విశాఖలోని టీబీ ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం ఆందోళనకు దిగారు. ఆస్పత్రి ప్రధాన గేట్ ఎదుట సెక్యూరిటీ సిబ్బంది నిరసనకు దిగి, నినాదాలు చేశారు. 10ఏళ్లగా ఆస్పత్రిలో పని చేస్తున్న వారూ ఉన్నారని, కార్తికేయ అనే సంస్థ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ పద్ధతిలో చేస్తున్న తమకు కొన్నాళ్లు నిర్వాహకులు సొంతడబ్బే ఇచ్చారని, ఇప్పుడడిగితే బిల్లులు రాలేదంటున్నారన్నారు. అదేమంటే 'స్కోర్' సరిగా లేదనే కారణంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ బిల్లులు ఆపేశారని చెబుతున్నారన్నారు. ఏ ఆస్పత్రిలోనూ లేని పరిస్థితి ఇక్కడే ఎందుకు దాపురించిందని, నాలుగు నెలలుగా జీతాల్లేకపోతే తమ కుటుంబాలెలా గడుస్తున్నాయన్నారు. 26రోజుల ఉద్యోగానికి 42మంది సెక్యూరిటీ సిబ్బందికి రూ.12099చొప్పున జీతాలివ్వాల్సి ఉండగా నెలల తరబడి పెండింగ్ పెట్టేశారన్నారు. అదేమని అడిగితే కార్తికేయ సంస్థపై ఆస్పత్రి వర్గాలూ, ఆస్పత్రి నిర్వాహకులపై కార్తికేయ సంస్థ తప్పించుకుంటున్నారని సెక్యూరిటీ సిబ్బంది కె.శంకర్రావు కన్నీటి పర్యంతమయ్యాడు.

## 13 వరకు పినగాడి పంచాయితీలో...

వేపగుంట – పినగాడి రహదారి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీలలో భాగమైన అత్యంత ప్రాధాన్యత గల బృహత్ ప్రణాళిక రహదారుల్లో ముఖ్యమైనది. ఈ రహదారిని వీఎంఆర్డీఏ, జీవీఎంసీ కలిసి సంయుక్తంగా విస్తరణ చేపడుతున్నాయి. వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశాల మేరకు, ఈ రహదారి విస్తరణలో కోల్పోతున్న భూమి, భవన యజమానుల నుండి అవసరమైన పత్రాలు, సమ్మతి పొందుతూ ట్రాన్స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ హక్కులు త్వరగా పరిష్కరించి సంబంధిత యజమానులకు వాటిని సాధ్యమైనంత త్వరగా అందించాలనే ఉద్దేశంతో పినగాడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో టిడిఆర్ మేళా ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదివరకు నిర్వహించబడుతోంది. అందువల్ల, సంబంధిత గ్రామస్తులు / ప్రభావిత వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, రహదారి విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అమలవడానికి వీఎంఆర్డీఏకు సహకరించవలసిందిగా కోరుతూ సంబంధిత వ్యక్తులు మార్చి 10వ తేది నుండి 13వ తేది లోపు పినగాడి పంచాయతీ కార్యాలయం / వీఎంఆర్డీఏ కార్యాలయాన్ని సందర్శించి, పినగాడి మరియు రాంపురం వీఆర్వో ద్వారా సంబంధిత పత్రాలను సమర్పించవలసిందిగా మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ సూచించారు.

## రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ పునర్వనం..

ఎలమంచిలి మార్చి 10, ప్రభాతవార్త

పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఎలమంచిలి నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి కార్యక్రమాల మీద మాట్లాడడం దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీలు ఇచ్చారని అన్నారు. నేను తలపెట్టిన మిషన్ పునర్ వనం కార్యక్రమాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినప్పుడు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే విధంగా చర్యలు చేపడతామన్నడం తాను ఎమ్మెల్యేగా ఎలమంచి నియోజక వర్గ ప్రజలు ఎంచుకున్నందుకు తనకు దక్కిన విజయంగా భావిస్తున్నానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారి అనుకుని మొక్కలు పెంచడానికి అమలు చేసే విధంగా చర్యలు చేపట్టడం,ఆటిజం గురించి అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆటిజం సంబంధించిన 125 కేంద్రాలను ఏర్పాటు చేయడం ఈ రెండు విషయాలు తాను ఎమ్మెల్యేగా ఉండగా ఒక అసెంబ్లీలో ప్రతిపాదించడం ఎంతో అదృష్టం అని అన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలోని ఎంతో అభివృద్ధి పనులను చేస్తున్నామని త్వరలో పట్టణంలోని 100 పడకల ఆసుపత్రి నిర్మాణం కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రి పట్టణంలోని లోపల ప్రాంతంలో ఉండటం వల్ల అత్యవసరంలో ఆసుపత్రికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని దీని దృశ్య త్వరలో పాత ఆసుపత్రిలోనే వైద్య అన్ని విధంగా చర్యలు చేపడతామని అన్నారు. అనంతరం అక్కడే నూతన ఆసుపత్రిని నిర్మిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రధానంగా గాజువాక ఎలమంచిలి రోడ్డు విస్తీర్ణ పనుల గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్ద ప్రస్తావించగా దీనిని సంబంధిత అధికారులను వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎండాకాలంలో మంచినీటికి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టామని ఇప్పుడు కూడా రెండు నెలలు ప్రతి ఇంటికి మంచి నీటి కులాయి ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నుండి నర్సీపట్నం కి వెళ్లే విధంగా రోడ్డును కూడా మన ఎలమంచిలి జాతీయ రహదారి అనుసంధానం చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్యను అధిగమించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశించానని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎలమంచిలి మండలం పట్టణం ఈ జిల్లాలోనే ప్రధాన పట్టణముగా అభివృద్ధి చెందుతుందని దీనికి కారణం అటు అడ్డు రోడ్డు సమీపంలో నక్కపల్లి వద్ద స్టీల్ ప్లాంట్ త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తున్నారని, అచ్యుతాపురం వైపు మరిన్ని పరిశ్రమలు వస్తున్నాయని నియోజకవర్గంలో ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని అక్కడే మెడికల్ కాలేజీ కూడా నిర్మాణానికి కృషి చేస్తున్నానని అన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటుకు ప్రభుత్వ అంగీకారం తెలిపిందని ఇందులో భాగంగా ఆ మెడికల్ కళాశాలను ఎలమంచిలి నియోజకవర్గంలో నిర్మించే విధంగా తన కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని క్రీడలు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అచ్చుతాపురంలోని క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలమంచిలి పట్టణంలోని రహదారిని త్వరలోనే వెడల్పు చేసి పనులను చేపడతారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజాన శేషు, పిఏసిఎస్ చైర్మన్ గోపి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ పిట్టా శ్రీనివాసరావు, రాంబిల్లి మాజీ ఎంపీపీ వసంతవాడ దిన్ బాబు, జనసేన నాయకులు కొటారు శ్రీనివాసరావు, లాలం సోమనాయుడు, కర్రీ ఝాన్సీ, చిట్టిబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఔట్రీచ్ అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం, మార్చి 10 ప్రభాతవార్త

విశాఖపట్నంలో మత్స్య, ఆహార ప్రాసెసింగ్ పథకాలపై ఔట్రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, ఆర్థిక శాఖ ఔట్రీచ్ ప్రోగ్రామ్ అవగాహన కార్యక్రమం – మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన యొక్క పి ఎం ఫార్మలైజేషన్ మంగళవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం జోనల్ మేనేజర్ నికేష్ కుమార్ సిన్హా , డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్ సీతారాం, ఏజీఎం ప్రాతినిధ్యం వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్ జనార్దన్, ఆంధ్రప్రదేశ్ మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణ్ రావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం డాక్టర్ హెచ్ టి వాసప్ప ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పథకాల ప్రయోజనాల గురించి వివరించి, వ్యవస్థాపకులు , మత్స్యకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా, పి ఎం ఎం ఎస్ వై కింద 19 మంజూరు లేఖలు , పి ఎం ఎఫ్ ఎం ఈ కింద 36 మంజూరు పత్రాలును వివిధ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## గాజువాకలో రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు

7వ తరువాయి ..

నుంచి జగ్గు సెంటర్ వరకు రూ. 13 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, ఆధునికీకరణ, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు ఏజె.స్టాలిన్, భూపతి రాజు సుజాతలతో కలిసి ఈ పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో పల్లా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే సుమారు రూ. 230 కోట్లతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గాజువాకను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని వార్డుల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పార్కులు, క్రీడా ప్రాంగణాలు, సామాజిక భవనాల నిర్మాణా నికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, రాజాన రామారావు, గంధం శ్రీనివాస రావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, జనసేన నాయకులు కరణం కనకారావు, సిపిఐ నాయకులు అప్పారీ విష్ణు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబికా అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి దాడి

అనకాపల్లి,మార్చి10, ప్రభాతవార్త

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయం పునర్నిర్మాణ ప్రారంభోత్సవం సందర్భంగా మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సతీ సమేతంగా కుటుంబ సభ్యులతో అమ్మవారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపా కటాక్ష వీక్షణాలు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా వీరభద్రరావు కోరారు.దాడి సతీమణి పద్మావతి, దాడి కుమారులు ప్రభాకర్, జయవీర్,లీడర్ దినపత్రిక సంపాదకులు వి వి రమణ మూర్తి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు ,నూకాంబిక దేవాలయ ట్రస్టీ బోర్డు చైర్మన్ పీలా నాగశ్రీను ఆలయట్రస్టీ బోర్డు సభ్యులు ఈ కార్యక్రమంలో మాజీమంత్రి వీరభద్రరావు వెంట పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

గాజువాక,మార్చి 10,ప్రభాతవార్త

మతసామరస్యానికి, సోదరభావానికి ఇఫ్తార్ విందులు వేదికలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం 60వ వార్డు పరిధిలోని శ్రీహరిపురం 'మసీదు–ఎ–నూర్'లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పవిత్ర మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. అల్లాహ్ దీవెనలతో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపుపై ఏపీఈపీడీసీఎల్ వెబినార్

7వ తరువాయి ..

నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ ఓ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు, మద్రాస్ ఐఐటి కి చెందిన ఎనర్జీ టెక్నాలజీ స్టార్టప్ సంస్థ ఎలిమెంట్స్ ఎనర్జీ (జుశ్రీవఎవత్ం జుఅవతీస్రఎ) భాగస్వామ్యంతో కమర్షియల్ విభాగం అధికారులు ఈ వెబినార్ నిర్వహించనున్నారు.

ఈ వెబినార్‌లో డిమాండ్ రెస్పాన్స్ విధానం మరియు టైమ్ ఆఫ్ డే టారిఫ్ విధానం గురించి వినియోగదారులకు అవగాహన కల్పించనున్నారు. ఈ విధానంలో విద్యుత్ వినియోగాన్ని పీక్, ఆఫ్–పీక్ మరియు సాధారణ సమయాలుగా విభజించడం ద్వారా పరిశ్రమలు తమ అధిక విద్యుత్ అవసరమయ్యే కార్యకలాపాలను పీక్ సమయాల నుండి ఆఫ్–పీక్ సమయాలకు మార్చుకోవడం ద్వారా విద్యుత్ వ్యయాన్ని తగ్గించుకునే అవకాశాలను వివరించనున్నారు. ప్రతిపాదిత టైమ్ ఆఫ్ దే విధానం ప్రకారం హై టెన్షన్ (ఞ) వినియోగదారులకు ఉదయం 5 నుండి 9 గంటల వరకు మరియు సాయంత్రం 7 నుండి 11 గంటల వరకు పీక్ సమయాలుగా పరిగణించి అదనపు టారిఫ్ అమలు చేయనున్నారు. అలాగే ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్–పీక్ సమయాల్లో పరిశ్రమల వినియోగదారులకు తక్కువ టారిఫ్ ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. మిగిలిన సమయాలు సాధారణ టారిఫ్ కింద పరిగణించబడతాయి. అదేవిధంగా 10 హెచ్‌పి పైబడిన లోడుతో ఉన్న లో టెన్షన్ (ూు) వినియోగదారులకు సాయంత్రం 7 నుండి 11 గంటల వరకు పీక్ సమయాల్లో అదనపు టారిఫ్ అమలు చేయనున్నారు. అలాగే ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్–పీక్ సమయాల్లో తగ్గించిన టారిఫ్ ప్రయోజనం అందుబాటులో ఉండనున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా పరిశ్రమలు మరియు వాణిజ్య వినియోగదారులు విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా విద్యుత్ బిల్లుల్లో ఆదా సాధించడంతో పాటు విద్యుత్ గ్రిడ్ పై ఉండే ఒత్తిడిని తగ్గించడంలో సహకరించగలరని అధికారులు తెలిపారు. అలాగే విద్యుత్ పంపిణీ వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడం మరియు పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఈ కార్యక్రమం దోహదపడనుందని పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని పరిశ్రమలు మరియు వాణిజ్య వినియోగదారులను ఈ వెబినార్‌లో పాల్గొనాలని సంస్థ ఆహ్వానించింది. ఈ కార్యక్రమంలో సమర్థవంతంగా పాల్గొని విద్యుత్ వినియోగాన్ని మెరుగుపరచిన పరిశ్రమ మరియు వాణిజ్య విభాగాల్లోని ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వినియోగదారులకు మొత్తంగా 10 లక్షల రూపాయల ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వినియోగదారులు మరిన్ని వివరాల కోసం ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ (కమర్షియల్) ఎస్.రాజబాబు, లేదా ఎలిమెంట్స్ ఎనర్జీ ఫౌండర్ ఆన్సన్ సాండో ๐91-9445613791 ఫోన్ నంబర్ లేదా ంబజూజూశీతీఏవశ్రీవఎవత్ంవఅవతీస్రఅవం.ఎఏవ ఇమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

## శతాబ్ది ఉత్సవ సంబరం

విశాఖపట్నం,మార్చి 10,ప్రభాతవార్త

ఆంధ్రవిశ్వకళాపరిషత్ పేరుకు సార్థకత చేకూర్చే విధంగా విద్యార్థుల నృత్యాభినయాలు సాగాయి. ఏయూ శతాబ్ది ఉత్సవం కార్యక్రమంలో భాగంగా నేడు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించిన సాంస్కృతిక వేడుక జోష్‌ను నింపింది. ఏయూ విద్యార్థుల కళా ప్రతిభను వేదికపై ప్రదర్శించిన విధానం ఆకట్టుకుంది. తమ కళా వైభవాన్ని కళ్లకు కట్టి చూపిన విధానం అదరినీ అలరించింది. వందేళ్ల వైభవానికి ప్రతీకగా ఏయూ యునైటెడ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శతాబ్ది ఉత్సవ సంబరం పండుగ వాతావరణాన్ని సంతరింపజేసింది. పౌరాణిక, ఇతిహాసాల గాథలను వేదికపై ఆవిష్కరించిన విధానం అందరి కరతాళధ్వనులను, ప్రశంసనలు అందుకుంది. యువత కేరింతలు, శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక సంబరాన్ని ప్రారంభించిన అనంతరం ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూ విద్యార్థుల అద్భుత కళాప్రదర్శనలు మనసును హత్తుకుంటున్నాయన్నారు. ఈ ప్రదర్శన వెనుక వారి కష్టం, సాధన, సమన్వయం ఉన్నాయన్నారు. త్వరలో జరగనున్న ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ఇది చోదకంగా నిలుస్తుందన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి, వారి ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య జాలాది రవి, ఎం.వి.ఆర్ రాజు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఎం.శశి, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మశ్రీ, ఐఏఎస్.ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజ కుమారి, ఆచార్య జి.గిరిజా శంకర్, డీన్‌లు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులే...కళాకారులుగా....

ఆంధ్రవిశ్వవిద్యాయలంలో తరగతి గదిలో కనిపించే విద్యార్థులంతా కన్వెన్షన్ సెంటర్‌కు చేరిపోయారు. వేదికపై ప్రదర్శనలు తిలకిస్తూ తన్మయత్వానికి లోనయ్యారు. వేదికపై ప్రదర్శనలు దేనికదే హైలెట్‌గా నిలచాయి. రామ కథను వేదికపై ఆవిష్కరించిన విధానం ఎంతో అకట్టుకుంది. రామ జననం, సీతా కళ్యాణం, సీతారాముల వనవాసం, సీతాపహరణం, రావణ సంహారం, సీతాదేవి అగ్ని ప్రవేశం చేయడం వంటి సంఘటనలు వేదికిపై కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం ప్రదర్శించిన నరసింహ స్వామి అవతరణ కథ వేదికపై ఆవిష్కరించిన విధానం అందరి మనసులను ఎంతో ఆకట్టుకుంది. యామిని ప్రియాంక శాస్త్రీయ నృత్యంతో ప్రారంభమైన వేడుకలు శ్రీనిధి బృందం సెమీ క్లాసికల్ నృత్యం, జోకర్ మైమ్, బిబిఏ విద్యార్థుల వెస్టర్న్ డాన్స్ ప్రదర్శనలు కేరింతలు కొట్టించాయి. పేరడీ పాటలు, వాయిస్ ఇమిటేషన్‌లు ఇలా ప్రతీ ప్రదర్శన దేనికదే ప్రత్యేకంగా నిలచాయి. వేదికపై ప్రదర్శనలు చూస్తున్నంతసేపూ వీరు విద్యార్థులా కళాకారులా అన్న సందేహం అందరిలో కలిగింది. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17వ తేదీన ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్న ఆంధ్రవిశ్వకళా పరిషత్ కళా ఉత్సవాల పోస్టర్‌ను వీసీ ఆవిష్కరించారు.

## నేరస్తుడు పిల్లి సింహాచలం పట్ల అప్రమత్తంగా ఉండండి..

(అడ్డురోడ్డు, ప్రభాతవార్త)

ఇటీవల జైలు నుంచి బయటకు వచ్చిన సింహాచలం అనే నేరస్తుడు విషయం లో మండలంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నక్కపల్లి సర్కిల్ సిఐ జూరెడ్డి మురళి కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అనకాపల్లి నేరస్తులు పిల్లి సింహాచలం విషయమై గ్రామాల్లో మురళి పలు ఫోటోలు ప్రదర్శిస్తూ తను ఇన్ని రూపాల్లో తిరుగుతుంటాడో ఏ విధంగా తిరుగుతుంటాడో నేరం ఏ విధంగా చేయడానికి ప్రయత్నిస్తాడు పూర్తిస్థాయిలో తెలియజేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా ఎక్కడైనా కనిపించినా తక్షణమే సమాచారం అందజేయాలని, ఇటీవల కాలంలో జరుగుతున్న బైక్ ,దేవాలయాలు దొంగతనాలు వివరాలను తెలియజేస్తున్నారు. ప్రజలు పోలీసులు సహకరించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానస్పదంగా ఈ ఫోటోలో ఉన్న వ్యక్తి పోలికల రూపంలో కనిపిస్తే తక్షణమే 94407 96105 ఈ నెంబర్ కు తక్షణమే సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## మంట పుట్టిస్తున్న 'వంట' గ్యాస్!

7వ తరువాయి ..

ఇందుకు భిన్నంగా ఉంది. ఏజెన్సీల వద్ద సిలిండర్ల కోసం వినియోగదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇదే అదనుగా కొన్ని ఏజెన్సీలు కృత్రిమ కొరతను సృష్టిస్తూ బ్లాక్ మార్కెట్‌కు తెరలేపాయి. సాధారణ బుకింగ్‌లను పక్కనపెట్టి, భారీ ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### స్టాక్ లేదు....రేపు రండి....

గాజువాక,శ్రీహరిపురం,మల్కాపురంలలో తదితర ప్రాంతాలలో బుక్ చేసిన వారం రోజులైనా సిలిండర్ ఇంటికి చేరకపోవడంతో గృహిణులు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ అయిపోవచ్చిన తరుణంలో ఏజెన్సీలకు వెళ్తే.. "స్టాక్ లేదు.. రేపు రండి" అనే సమాధానమే వినిపిస్తోంది. కానీ, అదనంగా రెండు మూడు వందల రూపాయలు చెల్లిస్తే మాత్రం గంటల్లోనే సిలిండర్ ప్రత్యక్షమవుతుండటం గమనార్హం.

### హెచ్చరిస్తున్న మేనేజ్‌మెంట్లు

మరోవైపు గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగొచ్చని, వినియోగదారులు ఆచితూచి వాడుకోవాలంటూ యాజమాన్యాలు అప్రమత్తం చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని చోట్ల సరఫరా గంటలకే పరిమితం కాగా, పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల ప్రభావం ఎక్కడ తమపై పడుతుందోనని సామాన్యులు బెంబేలెత్తుతున్నారు.

### ప్రభుత్వ చర్యలు ఏవి?

వంటగ్యాస్ మళ్లింపును అడ్డుకోవడానికి కేంద్రం బుకింగ్‌ల మధ్య గడువును 25 రోజులకు పెంచినా, అక్రమార్కులు మాత్రం యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తున్నారు. జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులు ఆదేశించినా, క్షేత్రస్థాయిలో తనిఖీలు నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్యాస్ పంపిణీలో పారదర్శకత పెంచాలని, బ్లాక్ మార్కెట్‌కు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## 'గ్రేటర్' టౌన్ ప్లానింగ్‌లో ఏసీబీ సోదాలు

(ప్రభాతవార్త–విశాఖపట్నం)

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మెరుపుదాడులు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వున్న టౌన్ ప్లానింగ్ విభాగాలపై ఇటీవల కాలంలో అత్యధిక ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. దీనిలో భాగంగా జీవీఎంసీ పరిధిలోని మధురవాడ, గాజువాక, పెందుర్తి జోన్లలోని టౌన్ ప్లానింగ్ విభాగాలపై సోదాలు చేపట్టింది. ఈ సోదాలు మంగళవారం ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. గత ఏడాది కాలంగా అనుమతుల కోసం అందిన దరఖాస్తులతో పాటు బీపీఎస్‌కు చేసుకున్న దరఖాస్తులను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. జీవీఎంసీ పరిధిలోని అత్యధికంగా మధురవాడ, గాజువాక, పెందుర్తి టౌన్ ప్లానింగ్ విభాగాలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. అదే విధంగా ఈ జోన్లకు చెందిన సిబ్బంది, అధికారులపై కూడా జీవీఎంసీ కమిషనర్‌కు కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నట్టు తెలుస్తోంది. ప్రతి వారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్ ఫోరంలో కూడా ఫిర్యాదులు అందుతున్నా.. అనుమతులు లేని భవన నిర్మాణాలపై ఎటువంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ అవినీతి పరిణామాలు రాష్ట్ర వ్యాప్తంగా వున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కూడా అధికంగా వున్నట్టు తెలుస్తోంది.

### రికార్డుల పరిశీలన

జీవీఎంసీ పరిధిలోని మధురవాడ, గాజువాక, పెందుర్తి జోన్లలోని టౌన్ ప్లానింగ్ విభాగాల్లోని రికార్డులను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించింది. అక్కడున్న అధికారులను, సిబ్బందికి పలు ప్రశ్నలను సంధించి, వివరాలు సేకరించారు. ముఖ్యంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్స్(ఏసీపీ)ను వున్న చోట నుంచి కదలనివ్వకుండా.. పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. మధురవాడ ఏసీపీ శాస్త్రి, గాజువాక ఏసీపీ వెంకరావు, పెందుర్తి ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, ఉత్తర జోన్ టీపీఓ ప్రవీణ్‌లపై ఇటీవల కాలంలో ఏసీబీకి అత్యధిక ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. మంగళవారం మాత్రం గాజువాక, మధురవాడ, పెందుర్తి జోనల్ కార్యాలయాలలో సోదాలు చేపట్టినా.. మిగిలిన జోన్ల పరిధిలో కూడా సోదాలు నిర్వహించే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

### అక్రమ నిర్మాణాలకు ప్యాకేజీలు!

బీపీఎస్‌ల ముసుగులో ఇటీవల కాలంలో అక్రమ నిర్మాణాల జోరు పెరిగింది. అవినీతి ముడుపులు ముసుగులో అక్రమంగా నిర్మించిన భవనాలను ప్రోత్సహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 200 గజాల్లో అక్రమ అంతస్తు నిర్మాణానికి ఐదు నుంచి ఆరు లక్షల రూపాయలను వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇందులో కింద స్థాయి సిబ్బందితో పాటు ఉన్నత స్థాయి వరకు అధికారుల ప్రమేయం వున్నట్టు తెలుస్తోంది. ప్యాకేజీ పేరిట అవినీతి సొమ్ములను వసూలు చేయడం.. అక్రమ అంతస్తుల నిర్మాణాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పరిపాటిగా మారింది.

### అంతా మేకాప్!

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులొస్తే.. అవినీతి సొమ్ములిచ్చిన భవనాల శ్లాబ్‌కు చిన్నపాటి కన్నాలను కొట్టి.. మేకాప్ చేయడం.. ఒకవేళ ముడుపులివ్వకపోతే, ఆ శ్లాబ్‌లను పెద్దగా కూల్చడం జీవీఎంసీ పరిధిలో జరుగుతున్నాయి. ఇవే అంశాలపై ఏసీబీ దృష్టికి కూడా వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంగా చేపట్టిన అక్రమ భవన నిర్మాణాలపై ఏసీబీ పూర్తిగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అనుమతులు ఇచ్చింది ఎన్ని ఫ్లోర్స్, ప్రస్తుతం ఆ భవనంలో నిర్మించిన ఫ్లోర్స్ ఎన్ని? అనే అంశాలపై ఏసీబీ ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది.

### సిబ్బంది పరుగులు..

జీవీఎంసీ పరిధిలోని మధురవాడ, గాజువాక టౌన్ ప్లానింగ్ విభాగంలో మంగళవారం రికార్డులను పరిశీలిస్తుండగా, భయంతో కొందరు ఉద్యోగులు కార్యాలయం నుంచి పరుగులు తీశారు. ఈ జోన్లలోని పెండింగ్ ఫైళ్లు, అక్రమ నిర్మాణాల అనుమతులపై ఏసీబీలకు ప్రశ్నలు సంధించి.. ఆరా తీసినట్టు తెలుస్తోంది.

## నార్త్ జోన్ ఆఫీస్ ఖాళీ

7వ తరువాయి ..

జరిగే సరికి నగరంలో టౌన్ ప్లానింగ్ అధికారులకు గుండెల్లో వణుకు పుట్టింది.అయితే జీవీఎంసీ నార్త్ జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరగపోయినప్పటికి టౌన్ ప్లానింగ్ సిబ్బంది భయంతో పరారైపోయారు. విధులకు హాజరై బాధ్యతగా పనిచేయవలసిన టీపీవో, ఏసీపీ,ఇతర సిబ్బంది ఒక్కరు కూడా మంగళవారం కార్యాలయంలో కనిపించలేదు.కార్యాలయం తెరిచి ఉన్నా సిబ్బంది లేకపోవడంతో కార్యాలయంకు వచ్చే జనం కార్యాలయం పని చేస్తుందా, లేదా అనే కోణంలో అయోమయంతో వెనుదిరిగారు.అయితే నార్త్ జోన్ పరిధిలో టీపీవో, ఏసీపీ,ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు పదుల సంఖ్యలో ఉన్నాయి.ఎక్కడ భవన నిర్మాణం జరిగిన లక్షలలో అక్రమంగా వసూల్ చేస్తూ వారికీ అనుకూలంగా ప్రజలు ఇంతవరకు ఎక్కడ వినలేని పత్రికల ద్వారా కూడా బెదిరింపులకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్పడుతున్నారని బిల్డింగ్ యాజమానుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.ప్రతి జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అవినీతి ప్రక్షాళన చేయాల్సి ఉందని పలువురు అంటున్నారు.

## 'గ్రేటర్' ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**-యలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీలకు కూడా ప్రత్యేకాధికారులు**

**-నియామక ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం**

(ప్రభాతవార్త–విశాఖపట్నం)



పాలకవర్గాల గడువు ముగిస్తున్న నేపథ్యంలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారులను నియామకం చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 17వ తేదీతో పాలకవర్గాల పదవీ గడువు ముగిస్తోంది. గడువు ముగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వారం రోజులు ముందుగానే మునిసిపాలిటీలకు, కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారులను నియామకం చేసింది. జీవీఎంసీ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ నియామకం చేయగా, యలమంచిలి మునిసిపాలిటీ(గ్రేడ్–3)కి యలమంచిలి ఆర్డీఓను, నర్సీపట్నం మునిసిపాలిటీ(గ్రేడ్–3)కి నర్సీపట్నం ఆర్డీఓను ప్రత్యేకాధికారులుగా నియామకం చేశారు. ఆరు నెలలు పాటు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టంచేసింది.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SAYED MEHTAB SHABANA W/O AHAMMAD ALI SAYYED, previously called SYED MEHTAB SHABANA R/O 11-31-15/1, AZEEMABAD, HAJI STREET, GAJUWAKA, VIZAG now changed my name from SYED MEHTAB SHABANA to SAYED MEHTAB SHABANA. Henceforth I will be called as SAYED MEHTAB SHABANA for all purposes. (Ro.No. 46431)

★ I, MARUPALLI AMARNADH S/O MARUPALLI POLAYYA, previously called MARUPALLI AMARANADH, R/O 1-165, CHINNA UPPADA, CHEPALAUPPADA, BHEEMUNIPATNAM, VIZAG now changed my name from MARUPALLI AMARANADH to MARUPALLI AMARNADH. Henceforth I will be called as MARUPALLI AMARNADH for all purposes. (Ro.No.46419)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## గాజువాకలో రూ. 13 కోట్లతో అభివృద్ధి పనులు

### -శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 10,ప్రభాతవార్త



నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన గాజువాకలోని వంటిల్లు కూడలి నుంచి జగ్గు సెంటర్ వరకు రూ. 13 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, ఆధునికీకరణ, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు ఏజె.స్టాలిన్, భూపతి రాజు సుజాతలతో కలిసి ఈ పనులను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో పల్లా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే సుమారు రూ. 230 కోట్లతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గాజువాకను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని వార్డుల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పార్కులు, క్రీడా ప్రాంగణాలు, సామాజిక భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, రాజాన రామారావు, గంధం శ్రీనివాస రావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, జనసేన నాయకులు కరణం కనకారావు, సిపిఐ నాయకులు అప్పారీ విష్ణు మూర్తి పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు సావిత్రిబాయి పూలే స్ఫూర్తి

గాజువాక, మార్చి 10,ప్రభాతవార్త



దేశంలో మహిళా విద్య, స్వేచ్ఛ ఆత్మగౌరవం కోసం తన జీవితాన్ని ధారపోసిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ఏపీ సివిల్ సప్లైస్ డైరెక్టర్, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళలు విద్యావంతులు కావాలని తొలితరం ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన పోరాటం మరువలేని దన్నారు. తన భర్త జ్యోతిరావు పూలే ఆశయాల సాధనలో భాగస్వామి అవుతూ, సామాజిక సమానత్వం కోసం ఆమె సాగించిన ఉద్యమం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర గ్రీవెన్స్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, 64వ వార్డు అధ్యక్షులు కోవిరి హరిబాబు పలువురు బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖలో కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై 8 కేసులు నమోదు...6.35లక్షల జరిమానా



మాధవధార, మార్చి 10, ప్రభాతవార్త

విశాఖలో 10 రోజులుగా రవాణా శాఖ అధికా రులు కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై 8 కేసులు నమోదు చేసినట్టు ఉప రవాణా కమిషనర్ ఆర్‌సి. హెచ్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించి అనుమతులు లేకుండా నడపడం, పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించడం, పన్నులు చెల్లించక పోవడం,ఇతర మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై కేసులు వంటివి గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘిం చిన 8 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.6,35,000 చలానా విధించారు.ప్రజల భద్రత దృష్ట్యా మరియు చట్టాల అమలు కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని ఆర్‌సి. హెచ్.శ్రీనివాస్ తెలిపారు.

## పైడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక,మార్చి 10,ప్రభాతవార్త



జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, వైకాపా గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనస్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మంత్రి శంకర్ నారాయణ, ధర్మాల శ్రీను, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కొంగపాలెం శ్రీశ్రీశ్రీ పైడమ్మ తల్లి అమ్మవారి పండగ

గాజువాక,మర్చి 10,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గం కొంగపాలెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ పైడమ్మ తల్లి పండగ మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు విశాఖ నగర డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రెడ్డి ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోవింద రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారి కృపాకటాక్షాలతో నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రూ. 48.50 లక్షలతో భగీరథ పార్కు అభివృద్ధి

### -శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక,మార్చి 10,ప్రభాతవార్త



సగరుల సామాజిక వర్గానికి ఇచ్చిన హామీని నెరవేరుస్తూ దుర్గానగర్‌లో భగీరథ పార్కు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ రాజాన రామారావుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ 71వ వార్డు పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన భగీరధుడి విగ్రహ ప్రాంగణంలో సుమారు రూ. 48.50 లక్షల వ్యయంతో అత్యాధునిక పార్కు, ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. విగ్రహావిష్కరణ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేశామని, సగరుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అంతకుముందు భగీరథుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, కరణంరెడ్డి నర్సింగరావు,కరణం కనకారావు,ఆకుల అప్పల సూరి, రొంగలి లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పొట్నూరులో ఘనంగా ముగిసిన పరదేశమ్మ ఉత్సవాలు



పద్మనాభం, మార్చి10, ప్రభాతవార్త

మండలంలో పొట్నూరు గ్రామంలో పచ్చని పంటపొలాలు మధ్య కొలువు దీరిన పరదేశమ్మ ఉత్సవాలు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి రాత్రి వరకు భక్తులు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి విశేష పూజలు చేసారు. రాత్రి గ్రామంలో పూర్వ సాంప్రదాయ ప్రకారం గ్రామంలో ఉన్న పలు కుటుంబాల వారు ఐదు రథాలను అలంకరించి రాజ్ వీధిలో ఊరేగించారు.అయితే 109 అరటిపండ్లు గెలలు కట్టిన అంజిలి రథం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.అనంతరం అమ్మవారి అనుపోత్సవంను పలు సాంస్కృతిక కార్యక్రమాలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో చుట్టాలు, బందువులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య అంచున నిలిచిన మహిళ

### నిమిషాల్లో రక్షించిన మహారాణిపేట పోలీసులు - సీపీ ఆదేశాలతో క్షణాల్లో స్పందించిన సీఐ దివాకర్ యాదవ్ -పాండురంగాపురం బీచ్ వద్ద తప్పిన విషాదం -ఇద్దరు పిల్లల తల్లి ప్రాణాలు నిలిపిన పోలీసుల అప్రమత్తత

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)



కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు చిన్న పిల్లలను వదిలేసి ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను మహారాణిపేట పోలీసులు క్షణాల్లో వెతికి రక్షించి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన సోమవారం రాత్రి విశాఖలో చోటుచేసుకుంది. మల్కాపురం ప్రాంతానికి చెందిన ఒక కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైంది. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి పాండురంగాపురం బీచ్‌కు చేరుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయం తెలుసుకున్న బాధిత మహిళ బంధువులు వెంటనే నగర పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి కి ఫోన్ చేసి విషయాన్ని తెలియజేసారు.వెంటనే స్పందించిన సీపీ బాగ్చి మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్‌కు ఫోన్ చేసి మహిళను వెంటనే రక్షించాలని ఆదేశించారు. సీపీ ఆదేశాలు అందుకున్న వెంటనే సీఐ దివాకర్ యాదవ్ అప్రమత్తమై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పాండురంగాపురం బీచ్ పరిసరాల్లో గాలింపు చేపట్టించారు. పోలీసులు కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఆ మహిళను గుర్తించి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆమెను అదుపులోకి తీసుకుని సురక్షితంగా రక్షించారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్, వారి బృందం చూపిన తక్షణ చర్యలను నగర పోలీసు కమిషనర్ బాగ్చి ప్రత్యేకంగా అభినందించారు. పోలీసుల అప్రమత్తత, సమయస్ఫూర్తి కారణంగా ఒక కుటుంబం పెద్ద ప్రమాదం నుంచి బయటపడిందని స్థానికులు అభినందించారు.

**పోలీసుల సమయస్ఫూర్తి వల్ల నిలిచిన ప్రాణం...**

సమయానికి స్పందించి మహిళను రక్షించిన మహారాణిపేట పోలీసుల చర్యలు ప్రజల్లో ప్రశంసలు అందుకుంటున్నాయి. ఒక్క క్షణం ఆలస్యం జరిగినా విషాదం చోటుచేసుకునే అవకాశం ఉండగా, సీఐ దివాకర్ యాదవ్ నాయకత్వంలో పనిచేసిన పోలీసు బృందం తక్షణ చర్యలతో ఒక తల్లి ప్రాణాన్ని కాపాడి ఆదర్శంగా నిలిచింది.

## గాజువాక టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



### -పరుగులు తీసిన సిబ్బంది

గాజువాక, మార్చి 10,ప్రభాతవార్త

గాజువాక జోనల్ కార్యాలయం టౌన్ ప్లానింగ్ విభాగంపై ఏసీబీ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు చేపట్టారు. గత కొంత కాలంగా పట్టణ ప్రణాళికలో అవినీతి పెచ్చుమీరిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న తనిఖీల్లో భాగంగా ఇక్కడ సోదాలు నిర్వహించారు. ఏసీబీ రాకతో కార్యాలయంలోని సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొందరు ఉద్యోగులు విధులను వదిలి బయటకు పరుగులు తీశారు. ప్రధానంగా అక్రమ నిర్మాణాల వద్ద వార్డు ప్లానింగ్ సెక్రటరీలు నిర్వహిస్తున్న వసూళ్ల పర్వంపై అధికారులు ఆరా తీస్తున్నారు. లంచాలు ఇస్తే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై దస్త్రాలను తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏసీపీ వెంకటరావు పై అవినీతికి పాల్పడుతున్నాడంటూ అనేక ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడఏసీబీ సోదాలుచేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. సాయంత్రం వరకు కొనసాగిన ఈ సోదాల్లో పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### విద్యార్థులకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత భాగ్చి అవగాహన -వీసీసీఎస్‌సీ ఆధ్వర్యంలో సీతమ్మధారలో సదస్సు -స్కిమ్మింగ్, ఫిషింగ్, ఓటీపీ మోసాలపై వివరణ -బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ వినియోగంపై సూచనలు

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)



సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి సూచించారు. విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (విసిఎస్‌సి) ఆధ్వర్యంలో సీతమ్మధారలోని ది ప్రెసిడెన్షియల్ స్కూల్‌లో మంగళవారం సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు కొత్త కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని పేర్కొన్నారు. స్కిమ్మింగ్, ఓటీపీ స్కామ్స్, ఫిషింగ్, విషింగ్, కస్టమర్ కేర్ మోసాలు వంటి సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వాస్తవ ఉదాహరణలతో వివరించారు. డీప్ వెబ్, డార్క్ వెబ్, క్రిప్టోకరెన్సీ వంటి అంశాల వల్ల కలిగే ప్రమాదాలను కూడా ఆయన వివరించారు.ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని కమిషనర్ సూచించారు. అనుమానాస్పద లింకులు, సందేశాలకు స్పందించకూడదని, సైబర్ నేరాలకు గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ వినియోగం ద్వారా సైబర్ నేరాలను నివారించవచ్చని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ది ప్రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ మరియు డైరెక్టర్ డి.ఎస్. ఆనంద్ దంపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన స్ఫూర్తిదాయక గీతాలను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన పాఠశాల యాజమాన్యానికి విశాఖపట్నం సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ కృతజ్ఞతలు తెలిపింది.

## భక్తి శ్రద్ధలతో తునివలస బంగారమ్మ అనుపోత్సవం



పద్మనాభం, మార్చి 10, ప్రభాతవార్త

మండలంలో తునివలస గ్రామంలో కొలువు దీరిన బంగారమ్మ అనుపోత్సవంను గ్రామ ప్రజలు మంగళవారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు జిల్లాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం ఉదయం నుండి కిటకిటలాడింది. భక్తులు బారులు తీరారు. ప్రజలు అమ్మవారికి పసుపు కుంకుమలతో విశేష పూజలు చేసారు.రాత్రి గ్రామంలో పాలదారి ఉత్సవం అనంతరం అమ్మవారిని గ్రామ రచ్చబండ నుండి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తీసుకొచ్చి గుడిలో ప్రతిష్ఠించారు. విద్యుత్ కాంతులతో గ్రామం వెలుగొందింది.ప్రజలకు మంచినీటి కొరత రాకుండా సర్పంచ్ సుంకర పైడిరాజు,గ్రామ పెద్దలు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, నాయకులు కోరాడ రాజుబాబు, నందినీ, అల్లు అప్పలరాజు,బుచ్చిపంతులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయాలపై టాస్క్ ఫోర్స్ కొరడా

### రెండు చోట్ల దాడులు... 51 మద్యం సీసాలు స్వాధీనం, ఇద్దరు అరెస్ట్ -రోజురోజుకు పెరుగుతున్న మద్యం విక్రయాలపై పోలీసుల కఠిన చర్యలు అవసరం

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)



అక్రమ మద్యం విక్రయాలపై విశాఖ నగర టాస్క్ ఫోర్స్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దబ్బందా, సతారువు గ్రామాల్లో మంగళవారం అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ సీఐ భాస్కరరావు నేతృత్వంలోని ప్రత్యేక బృందం రెండు ప్రాంతాల్లో సమన్వయం తో తనిఖీలు చేపట్టి అక్రమ మద్యం విక్రయాలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. వారి వద్ద నుండి మొత్తం 51 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఆనందపురం పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**అక్రమ మద్యం విక్రయాలపై కట్టడి అవసరం**

గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు అక్రమ మద్యం విక్రయాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యువతపై దుష్ప్రభావం చూపుతున్న ఈ అక్రమ వ్యాపారాలపై పోలీసులు మరింత కఠినంగా చర్యలు తీసుకుని తరచూ దాడులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఐక్య పోరాటాలతోనే పెన్షనర్ల సమస్యల పరిష్కారం

గాజువాక,మార్చి 10,ప్రభాతవార్త



పెన్షనర్లు ఐక్య పోరాటాల ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకోగలరని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే హుస్సేన్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 61వ వార్డ్ వెంకన్నపాలెంలోని సిఐటియు కార్యాలయం లో సిహెచ్. తమ్మారావు అధ్యక్షతన జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎఫ్ కమిషనర్‌ను కలిసి స్టీల్ ప్లాంట్, షిప్‌యార్డు పెన్షనర్ల సమస్యలపై విన్నవించామని తెలిపారు. ఈపీఎస్-95 కింద కనీస పెన్షన్ రూ. 9 వేలు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అన్‌క్లెయిమ్డ్ ఖాతాల్లోని రూ. 10,500 కోట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూడటం దుర్మార్గమన్నారు. పెన్షనర్లందరూ భవిష్యత్తు కార్యకలాపాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెన్షర్లు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

గాజువాక,మార్చి 10,ప్రభాతవార్త




పెదగంట్యాడ జంక్షన్‌లో మంగళ వారం మాతృశ్రీ సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా బుద్ధిస్ట్ ఫోరమ్ ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు టీబీఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ అధ్యక్షత వహించారు.

**బోధ్‌గయను అప్పగించాలని డిమాండ్..**

బీహార్‌లోని పవిత్ర బౌద్ధ పుణ్యక్షేత్రం 'బోధ్‌గయ'ను వెంటనే బౌద్ధులకు అప్పగించాలని కోరుతూ ప్లేకార్డులతో నిరసన చేపట్టారు. ముఖ్య అతిథులుగా సీనియర్ దళిత నాయకులు టేకేటి పెంటయ్య, గంట్యాడ గురుమూర్తి, మార్డుపూడి పరదేశి పాల్గొని ప్రసంగించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్, ములకలపల్లి చిన్నారావు, మట్టా కృష్ణారెడ్డి, కోరమాటి అన్నవరం, కాకర నర్సింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల భవిత కేంద్రంను సందర్శించిన ఎస్ఎస్ఎ ప్రాజెక్టు పరిశీలకులు

పద్మనాభం, మార్చి10, ప్రభాతవార్త



మండలంలో రెడ్డిపల్లి గ్రామంలో మోడల్ ప్రాథ మిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంను మంగళ వారం రాష్ట్ర ఎస్ ఎస్ఎ ప్రాజెక్టు పరిశీలకులు బొడ్డు మహాలక్ష్మినాయుడు, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నీరజ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి నాయడు మాట్లాడుతూ దివ్యాంగుల వివరాలను సాఫ్టువేర్‌లో అప్డేటు చేయాలని ఆయన సూచించారు. దీనివల్ల దివ్యాంగులకి ప్రభుత్వ పధకాలను, సదుపాయాలను కల్పించవచ్చునని ఆయన అన్నారు.

## అక్రమ మద్యం విక్రయాల ప్రాంతాలపై దాడులు

### రెండు చోట్ల కేసులు నమోదు

ఆనందపురం, మార్చి 10, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించి రెండు వేర్వేరు చోట్ల కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆనందపురం మండలం గండిగుండం గ్రామం సమీపంలోని సత్తరవు చెక్‌పోస్ట్ వద్ద ఉన్న పాన్ షాప్‌లో మామిడిపాక శ్రీనివాసరావు (60) అక్రమంగా మద్యం బాటిళ్లు నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆనందపురం ఎస్సై హరీష్‌రావుకు సమాచారం అందింది. దీంతో ట్రాఫిక్ పోలీసుల సహకారంతో అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో పాన్ షాప్‌లో 180 మిల్లీ లీటర్ల సామర్థ్యమున్న 48 మద్యం బాటిళ్లు లభించాయి. వెంటనే శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఇంకో ఘటనలో దబ్బంద గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి అనే మహిళ తన ఇంటి ముందున్న పాన్ షాప్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆమె ఆనందపురం వైన్ షాప్ నుంచి మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఎస్సై హరీష్ రావు, మహిళా పోలీసు సిబ్బంది మరియు పోలీస్ బృందం కలిసి అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా 180 మిల్లీ లీటర్ల 43 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లోనూ స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను సీఐ వాసు నాయుడు ఆధీనంలో ఉంచి కేసులు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం మొదటి కేసును హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌కు, రెండో కేసును హెడ్ కానిస్టేబుల్ పార్థసారథికి అప్పగించారు.

## బంగారమ్మ,పరదేశమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం,మార్చి 10, ప్రభాతవార్త



మండలంలో తునివలస, పొట్నూరు గ్రామాలలో కొలువ దీరిన బంగారమ్మ, పర దేశమ్మలను మంగళ వారం రాత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దర్శించుకొని పూజలు చేసారు. అమ్మవారి దీవెనలు ప్రజలపై ఉండాలని, పాడి పంటలను చల్లగా చూడాలని ఆయన అమ్మవార్లను వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రమణ,ఎఎంసి డైరెక్టర్ వి నందిని,మాజీ ఎంపీపీ లిలావతి, నాయకులు దాము,గంగరాజు, మహేష్, బుచ్చిపంతులు,పైల శ్రీను, సుమంతనాయడు ఎర్రినాయడు, అప్పలనాయడు,పాల్గొన్నారు.

## విశాఖలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు

### సౌత్ ట్రాఫిక్ సర్కిల్‌కు చొప్ప ప్రసాద్ పోస్టింగ్ -సిటీ వీఆర్--5 కు కిల్లి వెంకటరావు బదిలీ

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

విశాఖపట్నం నగర పోలీసు విభాగంలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు చేస్తూ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాల దృష్ట్యా ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆదేశాల్లో పేర్కొన్నారు.ప్రస్తుతం సౌత్ ట్రాఫిక్ సర్కిల్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కిల్లి వెంకటరావును సిటీ వీఆర్-5 కు బదిలీ చేశారు. అలాగే సిటీ వీఆర్-5లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ చొప్ప ప్రసాద్‌ను సౌత్ ట్రాఫిక్ సర్కిల్‌కు నియమించారు.సంబంధిత అధికారులను వెంటనే రిలీవ్ చేసి కొత్త స్థానాల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్, అడ్మిన్ విభాగాల అదనపు పోలీసు కమిషనర్లను ఆదేశించారు. కొత్తగా విధుల్లో చేరిన తేదీలు, రిలీవ్ వివరాలను కార్యాలయానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## విశాఖలో నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టు..!

### టాస్క్ ఫోర్స్ చాకచక్యం -పోలీసుల అదుపులో ఆరుగురు -మహారాణిపేట పరిధిలో దాడులు

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

విశాఖ నగరంలో నకిలీ కరెన్సీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ కరెన్సీతో సంచరిస్తున్న ఆరుగురిని నగర టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది.. నకిలీ ముఠా వ్యవహారం పై సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ సిబ్బంది ప్రత్యేకంగా గాలింపు చేపట్టి నకిలీ నోట్లతో తిరుగుతున్న ఆరుగురిని పట్టుకున్నారు.. వారి వద్ద నుంచి నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.అనంతరం వారిని తదుపరి విచారణ నిమిత్తం మహారాణిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.నగరంలో నకిలీ కరెన్సీ చలామణి ఘటనలు వెలుగులోకి వస్తుండడంతో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండి ఇలాంటి ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ong-10_ong-10.qxd 3/10/2026 11:40 PM Page 1






# బాలుడి మృతి వీడిన మిస్టరీ..

- 24 గంటల్లో నిందితుల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు..
- అక్రమ తుపాకులు ఎవరి దగ్గర ఉన్న కఠిన చర్యలు తీసుకుంటాం..
- ఇన్చార్జి డిఎస్పి మోహన్ రావు..

**ఎలమంచిలి, మార్చి 10 ప్రభాతవార్త:** మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో ఆదివారం అనుమానస్పద స్థితిలో బాలుడు మృతదేహం 24 గంటల్లోనే నిందితున్ని అదుపులోకి తీసుకున్న సీఐ ధనుంజయ రావు, రూరల్ ఎస్సై ఉపేంద్ర. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో పరవాడ ఇన్చార్జి డిఎస్పి బి మోహన్ రావు పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మోహన్ రావు మాట్లాడుతూ ఆదివారం ఏటికొప్పాక గ్రామంలో వరాహ నది ఒడ్డున పోలవరం కాలువ దగ్గర కొండ దిగువ భాగంలో ఉన్న తుప్పలలో బాలుడి మృతదేహం సంబంధించిన వివరాలను డి.ఎస్.పి మోహన్ రావు వెల్లడించారు. ఆదివారం కసింకోట సూరిబాబు ఇంటిదగ్గర కుమారుడు ఏటికొప్పాక గ్రామానికి చెందిన ఆడారి వెంకట కౌశిక్ (12) మరో ఏడుగురు పిల్లలు ఆదివారం స్కూల్ సెలవు కావడంతో ఆటకు వెళ్ళగా అక్కడ నడిదిలో స్నానం చేసి మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో సూరిబాబు ఇంటిలో అతని కుమారుడు మా ఇంటిలో తుపాకులు ఉన్నాయి చూద్దామని చెప్పడంతో పిల్లలంతా వాటిని చూచుట కొరకు వెళ్ళగా కసింకోట సూరిబాబు కుమారుడు వాటిని ఎలా వాడుతారో చూపిస్తుండగా అక్కడున్న రెండు నాటు తుపాకీలలో ఒకటి ప్రమాదవశాత్తు కసింకోట సూరిబాబు కుమారుడు చేతిలో ప్రమాదవశాత్తు ఫైర్ అవడంతో అది పక్కనున్న ఆడారు వెంకట కోసిక్కు తగలడంతో కసింకోట సూరిబాబు ఇంటి ముందర అక్కడే చనిపోగా పిల్లలు భయంతో పారిపోయారని దీంతో కసింకోట



సూరిబాబు అతను లైసెన్సు లేకుండా అక్రమంగా నాటు తుపాకులు కలిగి ఉండి వాటిలో మందు గుండు తట్టించి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఈ ప్రమాదం జరిగింది అంతట సూరిబాబు తన దగ్గర ఉన్న నాటు తుపాకులు వల్లే ఇది జరిగిందని భయపడి ఆడారి వెంకట కౌశిక్ మృతదేహన్ని అతని ఇంటి దగ్గరలో ఉన్న తుప్పలలో పడి వేసి నాటు తుపాకులను తీసుకుని అతని కుమారులతో పారిపోయాడని, సోమవారం సూరిబాబు ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సూరిబాబు కి గన్ పౌడర్ సప్లై చేసిన కసింకోటకు చెందిన ముత్యాల అప్పల రమణ ఇద్దరిని అరెస్టు చేసి సూరిబాబు వద్దనున్న రెండు నాటు తుపాకులు వాటికి సంబంధించిన మందు గుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సూరిబాబు ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు .ఎవరైనా అక్రమంగా ఫైర్ ఆర్మ్స్ కలిగి నట్లు అయితే చట్టబద్ధంగా కఠినమైన చర్యలు తీసుకోబడతాయని డీఎస్పీ మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయరావు, రూరల్ ఎస్సై ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారి పనులు ప్రారంభం.!

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)



రాష్ట్ర హోంమంత్రి అంగలపూడి అనితఆదేశాల మేరకు మండలం లోని పెద్ద తినార్ల పంచాయతీ మంజూరైన 30 లక్షల తో నిర్మించబోయే సిమెంట్ రోడ్లకు సంబంధించిన పనులను మంగళ వారం ప్రారంభించారు. కూటమి నాయకులు మెరుగు నాగేశ్వరరావు, గోసల చిన్న తాతారావు తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ

నర్సీపట్నం,మార్చి 10,ప్రభాతవార్త



నాతవరం జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల జీవితంలో పదో తరగతి ఒక ముఖ్యమైన మలుపు అని తెలిపారు. ఈ దశలో క్రమశిక్షణతో చదువుకుంటూ సమయపాలన పాటిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పరీక్షలను భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని, ఆత్మవిశ్వాసంతో రాస్తే తప్పకుండా ఉత్తమ ఫలితాలు వస్తాయని సూచించారు. అలాగే మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్య ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని ఆయన తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం 10 మండల జనసేన అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు సూరిశేఖర్, నాతవరం నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ, బొడ్డు పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డొంకమాంబిక అమ్మవారి పండగ మహోత్సవం

**అనకాపల్లి మార్చి 10 :(ప్రభాతవార్త)**



అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామంలో కొలువైయున్న శ్రీ డొంకమాంబిక అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొని అమ్మవారి ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాడి రత్నాకర్ ని సాలువ జ్ఞాపికతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నడింపల్లి తిరుపతి రాజు, నందవరపు కుమార్, నందవరపు శంకర్రావు, నక్క చెల్లయ్య, మాది మహేష్, నందిగట్ల సత్తిబాబు, ఎర్ర బుజ్జి, కొండపల్లి చిన్న, మజ్జి రాంబాబు, నందవరపు హరీష్ కృష్ణ, మాదే దిలీప్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సీఐ జూరెడ్డి" మురళి"ని సత్కరించిన నాయకులు

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



నక్కపల్లి సర్కిల్ సిఐ జూరెడ్డి మురళిని వేంపాడుకు చెందిన పలువురు నాయకులు సత్కరించారు. పి ఫోర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేంపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ఆయన్ను మండలం పార్టీ ఉపాధ్యక్షులు గ్రామ ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, జయరాం, గ్రామ పంచాయతీ కార్యదర్శి కాకరసత్యం తోపాటు పలువురు అభినందించారు.

## మోడీ ప్రభుత్వం లో మహిళలకు అధిక ప్రాధాన్యత

- మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

**అనకాపల్లి మార్చి 10 (ప్రభాతవార్త)**



కేంద్రంలో మోడీ ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ మహిళా సాధికారత కొరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక లక్ష్మీదేవిపేట సీతారామ కళ్యాణ మండపంలో అనకాపల్లి జిల్లా బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆలోచనలో పుట్టుకొచ్చిన స్త్రీ శక్తి పంచకం కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. అనకాపల్లి జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హాజరయ్యారు. భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మహిళల కోసం అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళల కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు . పారిశుద్ధ్య కార్మికులకు బట్టలు పంపిణీ, బాలింతలకు ఆరోగ్య కిడ్స్ పంపిణీ, పేరొందిన క్రీడాకారులు ఉపాధ్యాయులు సంఘ సేవకులు తదితర ప్రముఖులను ఎమ్మెల్యే చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, బొడ్డేడ నాగేశ్వరరావు, ఉమ్మడి సుజాత, కట్టా పద్మ, మండల సంతోషి సుబ్బలక్ష్మి, తేజస్వి అనురాధ ,భానుమతి,కనకమహాలక్ష్మి,సత్యవాణి, సత్యవేణినాయుడమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలూ..ఒత్తిడికి గురికావద్దు.. ప్రశాంతంగా పరీక్షలు వ్రాయండి

: అదనపు ఎంఈవో"నాగన్నదొర"

(నక్కపల్లి, ప్రభాతవార్త)



త్వరలో నిర్వహించబోయే పదవతరగతి పరీక్షలను విద్యార్థులందరూ ఆత్మ స్థైర్యంతో, ఆత్మ విశ్వాసంతో రాయాలని ఎవరూ ఎటువంటి ఒత్తిడిలకు గురికావద్దని స్థానిక మండల విద్యాశాఖాధికారి అదనపు రుత్తల నాగన్నదొర తెలిపారు. మంగళవారం డి.ఎల్.పురం హైస్కూల్ ను సందర్శించి పదవతరగతి విద్యార్థుల వందరోజులకార్యాచరణ అమలవుతున్న తీరు పరిశీలించారు .పరీక్షలు దగ్గరపడు తున్నందువలన ఎవరూ ఎటువంటి ఆందోళన, ఒత్తిడికి గురికావద్దన్నారు. పదవతరగతి విద్యార్థులు లక్ష్యసాధనాదిశగా పాటుపడాలన్నారు. ఎటువంటి తడబాటులేకుండా పరీక్షలు రాయాలన్నారు. ఏదైనా విషయం అర్థంకాకపోతే వెంటనే ఉపాధ్యాయులను అడిగితెలుసుకోవాలన్నారు. పరీక్షలు మన జీవితాలను నిర్ణయించేవి మాత్రమేకాదని, మన సామర్థ్యాలను అంచనావేసేవని అన్నారు. కాబట్టి భయాన్ని విడిచిపెట్టి ధైర్యంగా పరీక్షలు రాయాలని ఆయన అన్నారు .ప్రతీవిద్యార్థి నేను చదవగలను, నేను చదివిన అంశాలను రాయగలను అనేలా సానుకూల దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు .ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండాలన్నారు. చివరినిమిషంలో చదవకుండావిషయాన్ని విభజించుకుని రివిజన్ చేయాలన్నారు. గత ప్రశ్నాపత్రాలను సాధన చేయడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం, చేయాలన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగగా వారు చెప్పిన సమాధానాలతో ఆయన సంతృప్తి చెందారు .ఈయన వెంట పాఠశాల హెచ్.ఎమ్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు అమలకంటి ఏసుదేవుడు, జాలాద్రి, సూర్యారావు తదితరులు ఉన్నారు. ఈ విద్యాసంవత్సరంలో మండలంలో 14 ఉన్నతపాఠశాలలనుండి 876 మంది విద్యార్థులు పదవతరగతి పరీక్షలకు హాజరవు తున్నారు. వీరిలో బాలురు432, బాలికలు 444 మంది ఉన్నారు. ఈవారాంతమునాటికి వందరోజుల కార్యాచరణ ప్రణాళిక పూర్తి కానుంది. ఇప్పటికే స్లిప్ టెస్టులు, ప్రిపరేటరీ, గ్రాండ్ టెస్టులు పూర్తయ్యాయి. విద్యార్థులలో అనూహ్యమైన ఫలితాలు వస్తున్నాయి .రైజింగ్ స్టార్స్ విద్యార్థుల ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈనెల 16 నుండి జరగబోయే పరీక్షలలో మండలంలో అన్ని పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన స్పందన.!

(నక్కపల్లి ,ప్రభాతవార్త )







మండలం లోని వేంపాడు గ్రామంలో పి ఫోర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆద్వర్యంలో, మార్గదర్శిగా ఉష ప్రేమ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా ఈసీజీ, స్పైరోమెట్రీ, జి ఆర్ బి ఎస్ ,యూరిక్ యాసిడ్ వంటి పరీక్షలతో పాటు వైద్యులు సూచన మేరకు ప్రాథమిక కంటి పరీక్షలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు తీసుకున్నారు. ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో నక్కపల్లి సర్కిల్ సీఐ జూరెడ్డి మురళి ,మండల టిడిపి అధ్యక్షులు గింజల లక్ష్మణరావు ,మండల టిడిపి ఉపాధ్యక్షులు ఐనంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ కుంచే మధు, సర్పంచ్ ఏడిద నూక రత్నం, పంచాయతీ కార్యదర్శి కాకర సత్యం, యంగ్ ప్రొఫెషనల్ ఎం. జయరాం గ్రామ్ టిడిపి నాయకులు కల్లేపల్లి వెంకటపతి రాజు మండల తెలుగు యువత అధ్యక్షులు కమ్మెల్ల శివరామకృష్ణంరాజు ,పల్లా రాంబాబు, పల్లా నాగరాజు, దారబాల బుజ్జి, స్కూల్ ఛైర్మన్ సూరిబాబు తదితరులు చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచి, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించింది యంగ్ ప్రొఫెషనల్ జయరాం అన్నారు.

## ముగిసిన వృత్తి నైపుణ్య విద్య ప్రాక్టికల్ పరీక్షలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలం లోని గొడిచెర్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు వృత్తి విద్య ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ముగిశాయి. కంప్యూటర్ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలు పాఠశాలలోనే నిర్వహించామని ప్రధాన ఉపాధ్యాయులు యస్. బి. వి సత్య కుమార్ తెలిపారు. పరీక్షలకు 69 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు బి. లలిత, ఎం.సాయి చంద్, తదితరులు తో పాటు ప్రాక్టికల్ పరీక్షల అనంతరం విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.



## నూకాంబిక అమ్మవారి ఉత్సవాలను జయప్రదం చేయాలి

- ఆలయ ఛైర్మన్ పీలా నాగ శ్రీను

**అనకాపల్లి మార్చి 10 :(ప్రభాతవార్త)**



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఉత్సవాలను జయప్రదం చేయాలని ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ పిలా నాగ శ్రీను విజ్ఞప్తి చేశారు. ఆలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న నూకాంబిక అమ్మవారి జాతర 18న కొత్త అమావాస్య పండగతో పాటు 19న ఉగాది ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలు నెలరోజుల పాటు ఏప్రిల్ 17 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో నెల రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు. మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కృషి మేరకు రాష్ట్ర పండగగా గత ఏడాది ప్రభుత్వం ప్రకటించిన దగ్గర నుండి రెండవ ఎట ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రతినిధిగా జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లి రవీంద్ర అమ్మవారికి పట్టు వస్త్రాలను 18వ తేదీన సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తాటకు పందిళ్ళు, క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మవారి నూతన ఆలయ ప్రతిష్ట గడచిన ఎనిమిదో తేదీన జరిగిందని అప్పటినుండి అమ్మవారి మూల విరాట్ కు దర్శనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ భీమర శెట్టి రామ్ కి పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నెల పండుగ ఉత్సవాలపై ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందన్నారు. సాధారణ భక్తులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆలయానికి వచ్చే రోడ్లన్నీ మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. స్వాగత ద్వారాలు , విద్యుత్ దీపాలతో అలంకరించడం జరిగిందన్నారు. ఆలయంతో పాటు వంద అడుగుల రాజగోపురం కూడా రంగులతో అలంకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు సుధారాణి, ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు , మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా విద్యార్థినులకు హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

- హాస్టల్ సౌకర్యాలు లేక మహిళా విద్యార్థినుల ఇబ్బందులు

**అనకాపల్లి రూరల్ మార్చి 10 :(ప్రభాతవార్త)**



ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా కళాశాల విద్యార్థినుల కోసం అనకాపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏ ఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలనాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపురాజు దీక్ష శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా విద్యార్థినులు హాస్టల్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు సరైన వసతి లేక ఆర్థికంగా , భద్రత పరంగా సమస్యలు ఎదుర్కొంటూ చదువును కొనసాగించడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా కళాశాల విద్యార్థినుల కోసం ప్రత్యేక ప్రభుత్వ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థినుల విద్యా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మహిళా హాస్టల్స్ ఏర్పాటుకై జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలని వచ్చే విద్యా సంవత్సరానికి ఖచ్చితంగా మహిళా హాస్టల్స్ ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ఈ డిమాండ్లు నెరవేర్చే వరకు ఏ ఐ ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణికంఠ, నవీన్ సాయి, చరణ్, ప్రసాద్, లికిత, దీపిక, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా నూకంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు

(ఎస్. రాయవరం మార్చి 10 ప్రభాతవార్త)



మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నూకంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర పురస్కరించుకొని మంగళవారం ఘటాల ఊరేగింపు శతకం పట్టు నుండి పురవీధుల్లో డబ్బులు. మేళ తాళాలతో మందు గుండు సామగ్రితో అమ్మవారి ఘటాలను ఘనంగా ఊరేగించారు. భక్తులు ప్రతి ఇంటి నుండి హారతులు ఇచ్చి అమ్మవారిని ప్రార్థించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు. గ్రామస్తులుపాల్గొన్నారు.

ong-12_ong-12.qxd 3/10/2026 11:41 PM Page 1



## గుడివాడ అమర్నాథ్ ,బొడ్డేడ ప్రసాదులను సత్కరించిన రాష్ట్ర వైకాపా నేత "వీసం"

(నక్కపల్లి, ప్రభాతవార్త)





రాష్ట్ర మాజీ మంత్రి, చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గా ఉన్న గుడివాడ అమర్నాథ్ ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా ఇన్చార్జిగా నియమితులైన సందర్భంగా రాష్ట్ర వైకాపా కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో మంగళవారం విశాఖపట్నం లో మర్యాదపూర్వకంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా సత్కరించారు. గజమాలతో అమర్నాథ్ ను సత్కరించిన రామకృష్ణ అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమితులైన బొడ్డేడ ప్రసాదును ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతూ సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ పార్టీ అధ్యక్షులు ప్రసాద్ అభినందించారు. సత్కరించిన వారిలో జడ్పిటిసి సభ్యురాలు గోసలకాసులమ్మ, మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి పొడగట్ల పాపారావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ కాకర వెంకట్రావు, సర్పంచులు తల్లా భార్గవ్ తో పాటు గొర్ల గోవిందు, పి .రమణ ,ఎన్. రామకృష్ణ ,పిక్కి తాతలు, వంకా కృష్ణ ,మైలపల్లి అప్పలరాజు, చంటి రాజు, దండు బలరామరాజు, నెట్ల గోవిందు , కొవ్వూరి రమణ ,బాబ్జి తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి వారి తీర్థ మహోత్సవం

**చోడవరం, మార్చి 10, ప్రభాతవార్త:** చోడవరం తామరచెరువు, లక్ష్మీదేవి పేట వీధిలో వేంచేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనురు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ గూనురు వెంకట సత్యనారాయణ వెంకట అప్పారావు బొబ్బిలి ప్రసాద్ పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సంస్క ృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



## నూతన కమిటీలు ఏర్పాటు:నాఫ్ అధ్యక్షుడు మోసా

**(నక్కపల్లి, ప్రభాతవార్త)** జాతీయ మత్స్యకార సంఘంనూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నమని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు అన్నారు.మంగళవారము నక్కపల్లి లో సమావేశమై మత్స్యకారులు ఐక్యత కోరకు ప్రతి ఒక్కరు సహకారారం అందించాలనీ అన్నారు.ఈ నేల 15 న నూతన కమిటిలు ఏర్పాటు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమము లో జాతీయ మత్స్యకార నాయకులు పిక్కి కొర్లయ్య,ఎరిపిల్లి అప్పలరాజు,కోవిరి వెంకటేష్,ఎం.జగ్గారావు, గంగరాజు త దితరులు పోల్గొన్నారు



## పేటరూరల్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నూతన కార్యవర్గ ఎన్నిక

**పాయకరావుపేట, మార్చి 10, ప్రభాతవార్త**



పాయకరావుపేట మండల రూరల్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. మండలంలోని పాల్తేరు షకీనా సిటీ ప్రాంగణంలో రెవ యస్. ఏసురత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు పాస్టర్లు పాల్గొని ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా రెవ. యస్. డేనియల్, ఉపాధ్యక్షుడిగా రెవ. కె. పరమానందం, కార్యదర్శిగా పాస్టర్ జి. జోషి, కోసాధికారిగా పాస్టర్ డి. ఐజక్, సహాయ కార్యదర్శులుగా పాస్టర్ జాషువా, యమ్ విల్సన్, జి. మనోజ్, సహాయ కోసాధికారిగా బి సత్యకుమార్, కార్యవర్గ సభ్యులుగా సిహెచ్ సాల్మన్, జక్కి జాన్ ఎన్నికైనట్లు ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా రెవ. కెయస్ఆర్ థామస్, చైర్మన్ గా రెవ.డా.యస్. ఓబధ్య నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఫెలోషిప్ లోని పాస్టర్లు, సంఘ నాయకులు అభినందించారు. పాయకరావుపేట రూరల్ పాస్టర్స్ వెల్ఫేర్ సహవాస బలోపేతానికి దేవుని సేవకు కృషి చేయాలని సంకల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నూతన అధ్యక్షుడు, పాస్టర్ల ఐక్యత కోసం సంఘాల సేవాభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.

## రైతులు ఈ పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

**(ఎస్.రాయవరం మార్చి 10 ప్రభాత వార్త )**

రైతులు ఈ పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారిణి సౌజన్య అన్నారు. కొరుప్రోలు. గుర్రాజుపేట గ్రామాలలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. వ్యవసాయ పథకాలు అందాలంటే ఈ పంట జాబితా లో నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే వర్ధంతి కార్యక్రమం

**ముంచంగిపుట్టు మార్చి 10 (ప్రభాతవార్త)**

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగి పుట్ మండలం సెల్లుం పుట్టు పాఠశాలలో భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి పాఠశాల ఉపాధ్యాయులు మరియు బోధనేతర సిబ్బంది ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఎం ధర్మారావు, ఆర్ కామేష్ లు మాట్లాడుతూ: సావిత్రిబాయి పూలే భారతదేశ బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి చేసిన సేవలను మరియు సంఘ సంస్కర్తగా సాధించిన ఘనతను కొనియాడారు. వారి సేవలను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు, అన్ని వర్గాల ప్రజానీకం సామాజిక బాధ్యతతో మంచి సమాజ నిర్మాణానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కే. మోహన్, దోనమ్మ, రుకునా, పార్వతి తో పాటుగా స్వయం సహాయక గ్రూప్ మహిళా సంఘ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



## వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక అవసరం

:: కె వి కె సమావేశం

**(రాంబిల్లి మార్చి 10 ప్రభాతవార్త)**






రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామంలో ఉన్న భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ కృషి విజ్ఞాన కేంద్రం (బీసీటి కెవికె) లో జరిగిన 26వ శాస్త్రీయ సలహా సంఘం సమావేశానికి చైర్మన్ శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవడం అవసరమని సూచించారు, పంటల వైవిధ్యాన్ని పంచడం నీటి సంరక్షణ పద్ధతులను అమలు చేయడం మరియు సమయానికి విత్తనాలు వేసుకోవడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు, అనకాపల్లి పరిశోధన సహాయ సంచాలకులు సిహెచ్. ముకుందరావు మాట్లాడుతూ రైతులకు శాస్త్రీయ సలహాలు అందించి వ్యవసాయంలో లాభదాయకతను పెంచేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు, సహాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ వి. విశాలాక్షి మాట్లాడుతూ సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ విధానాలను మరింత ప్రోత్సహించవలసిన అవసరం ఉందని అన్నారు, జీవన ఎరువులు మరియు లింగాకర్షక ఎరలు వంటి ఖర్చు తగ్గించే నేల సారాన్ని పెంచే వనరులు కెవికె లో అందుబాటులో ఉండాలని అన్నారు, ఈ కార్యక్రమంలో చింతపల్లి పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ ఏ. అప్పలస్వామి, జిల్లా వ్యవసాయ అనుబంధ శాస్త్రవేత్తలు ఝాన్సీ లక్ష్మి, ఉమా, ప్రసాద్, విజేత, తులసీమణి ,డా. శ్రీదేవి, డా. కుమారి, డా. రాజ్ కుమార్, ఆకాశవాణి నుంచి సుధాకర్ రెడ్డి మరియు అభ్యుద రైతులు పాల్గొన్నారు .

## ఉగాది అంటే యుగానికి ఆది

**(ఎస్.రాయవరం మార్చి 10 ప్రభాతవార్త)**



ఉగాది అనాదిగా వస్తున్న పండుగ రోజు సృష్టికర్త ఐన పరమాత్మ దేవుడి నే ఆరాధించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రీ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు అన్నారు.ఈ నేల 19వ తేదీన రాబోవు ఉగాది పండుగ పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి వారు రచించినటు వంటి 100 ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను, మరియు త్రైత సిద్ధాంత భగవద్గీ. ఎస్ రాయవరం మండలం పాత పోలవరం గ్రామంలోమంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.రాబోయే యుగాది పండుగ గొప్పతనం ను శాస్త్రబద్దం గా వివరించారు. భారత దేశంలో 6 ఋతువులు చాలా గొప్పగా ఉండేలా దేవుడు సృష్టించాడని. ఈ సకల చరా అచర ప్రకృతి లను సృష్టించిన ఆ దేవుడి పై భక్తి కలిగి ఉగాది రోజున సృష్టి కర్త అయిన పరమాత్మను కృతజ్ఞత తో ప్రార్థించి గుర్తు చేసుకోవాలన్నారు. యుగాది పండుగ ఆధ్యాత్మిక రహస్యంను శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన మన పండుగలు గ్రంథంలో ఉగాది అంటే యుగానికి ఆది అని, దేవుని చేత ఆదివారం ఈ సృష్టి ఏర్పడిందని కాబట్టి మొట్టమొదటి పండుగ యుగాది అని తెలిపారు., పూర్వం ఉగాది రోజు ఆరు గుణాలకు ప్రతీకగా షడ్రుచుల ప్రసాదం ను తయారుచేసి దైవం ముందర ఉంచి మాలోని గుణాల మాయను తీసివేసి మోక్షానికి దగ్గర చేయమని ప్రార్థించేవారని తర్వాత భక్తితో ఉగాది ప్రసాదం ను స్వీకరించేవారు. అని తెలిపారు.యుగాది ప్రసాదం రాను రాను యుగాది పచ్చడి గా మారిందని ప్రసాదం అని పిలవడం పద్ధతి గా ఉంటుందన్నారు. కార్యక్రమం లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రీ కమిటీ సభ్యులు సోమనాయుడు, రమాదేవి, అన్వీష , శైలజ లు పాల్గొన్నన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులకు ప్రత్యేక గుర్తింపు

- మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న

**కశింకోట, మార్చి 10, ప్రభాతవార్త;**

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులకు 11 అంకెలతో కూడిన ఆధార్ తరహా ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న అన్నారు.మంగళవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 14లోగా రైతు సేవా కేంద్రాలలో ఈ పంట రబీ 202526 కు నమోదు చేసిన జాబితా ప్రదర్శించడం జరిగిందని, రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి తెలియచేసి పరిష్కరించుకోవాలన్నారు.అలాగే ఈ కే.వై.సి చేయించుకోలేని వాళ్ళు ఉంటే రైతు సేవా కేంద్రంలో చేయించుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం వలన పీఎం కిసాన్ పథకం వర్తింపు ఉంటుందన్నారుపంట నష్టం, ప్రకృతి వైపరీత్యాలు, బీమా పరిహారంలో ఈ గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగకరం ఉంటుందన్నారు. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామివారి ఊరేగింపు

**( ఎస్. రాయవరం మార్చి 10 ప్రభాతవార్త)**

మండలంలో అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయ స్వామివారి వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం భారీ సంఖ్యలో భక్తులు స్వామివారి పాదుకలు.వెండి ఆభరణాలు తో ఊరేగించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని వ్యర్ధ ప్రసాదం స్వీకరించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## బడియల్ పురం గ్రామంలో పర్యటించిన జాతీయ బృందం సభ్యులు.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**





జాతీయ పంచాయతీ అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం లోని ధోనివాని లక్ష్మీపురం గ్రామ పంచాయతీ "చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్" విభాగంలో ఎంపిక కావడం తో ఆ గ్రామంలో మంగళవారం జాతీయ బృందం సభ్యులు పలు పలు విభాగాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వము నియమించిన పరిశీలన బృందం అధిపతి మలై పాల్ మంగళవారం ధోనివాని లక్ష్మీపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో ఉన్నత పాఠశాల, రెండు ఎలిమెంటరీ పాఠశాల మూడు అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ "చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్" ప్రమాణాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుందా లేదా అన్న విషయాన్ని బృందం సమగ్రంగా పరిశీలించింది. ప్రధానంగా గ్రామంలో పిల్లల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను బృందం సమీక్షించి పూర్తిస్థాయి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సి పి ఆర్ వైస్ డి శ్రీనాథ్ రెడ్డి, ఏపీ ఎన్ఐఆర్డీ నాగరాజు ,జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణమూర్తి , జిల్లా గ్రామపంచాయతీ అధికారి సందీప్, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి నాగలక్ష్మీ, మండల స్పెషల్ ఆఫీసర్ విజయ, ఎంపీడీవో చైతన్య, సతీష్, డిప్యూటీ ఎంపీడీవో చలపతి రావు, సర్పంచ్, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా చైర్మన్ దొన్నుదొర జన్మదినోత్సవ వేడుకలు

**అరకులోయ, మార్చి 10, ప్రభాతవార్త :**



ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గ ఇన్చార్జి సియ్యారి దొన్నుదొర జన్మదిన శుభ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం ప్రాంగణం లో జరిగిన చైర్మన్ దొన్నుదొర పుట్టినరోజు వేడుకలో విశాఖ, విజయనగరం, ఎస్.కోట, పాడేరు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన అధికారులు , సిబ్బంది, తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గ కి చెందిన ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాంట్రాక్టర్లు ప్రత్యేకంగా పాల్గొని తమ శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్మన్ దొన్ను దొర భవిష్యత్తులో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో ఘనంగా జరుపుకోవాలని , నిండు నూరేళ్ల సంపూర్ణ ఆరోగ్యంతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టాలని నాయకులు, అధికారులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఆయన తన ధన్యవాదాలు తెలియజేశారు. అందరి సహకారంతో ముందుకు వెళ్తానని , నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, అలాగే ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని దొన్నుదొర చెప్పారు. అంతకుముందు పండగ వాతావరణం లో కేక్ కటింగ్ జరిగింది. ఈ కార్యక్రమం లో ఏఎంసి చైర్మన్ బిబి లక్ష్మి, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టిడిపి పార్టీ అరకులోయ మండల అధ్యక్షులు లోకోయి మహదేవ్, మాజీ అధ్యక్షులు శెట్టి బాబురావు, డుంబ్రిగుడ మండల అధ్యక్షులు కిల్లో ఆనంద్, అనంతగిరి మండల అధ్యక్షులు సుబ్బారావు, హుకుంపేట మండల పార్టీ అధ్యక్షులు బుల్లిబాబు, పెదబయలు మండల పార్టీ అధ్యక్షులు కొండయ్య, ముంచింగి పుట్టు మండల పార్టీ అధ్యక్షులు కే సన్యాసమ్మ , అరకులోయ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాంగి రాజు, ఉపాధ్యక్షులు కోన రమేష్ , అధికార పార్టీ ప్రతినిధి గెన్ను, ఎంపీటీసీ లు భీమరాజు, వరాలమ్మ , నాయకులు సుబ్బారావు, వెంకట్, చందు పాడి, నాగరాజు, త్రినాథ్, ఆరు మండలాల పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్జీఓ వ్యవస్థాపక సభ్యులు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆమనగంటి జయంతి: ఘన నివాళి:

**పాడేరు,మార్చి10, ప్రభాతవార్త:** ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు మరియు మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆమనగంటి శ్రీరాములు 105వ జయంతి సందర్భంగా మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో జిల్లా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షులు లకే రవీంద్రనాథ్ పాత్రుడు, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ గుల్లేలి సింహాద్రి మరియు జిల్లా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పాడేరు భవనంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, వారి సేవలను స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ... ఆమనగంటి శ్రీరాములు స్ఫూర్తితో జిల్లా పరిధి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపైన, జిల్లా ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఐక్యంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా పెండింగ్లో ఉన్న పే రివిజన్ అమలు, బకాయిలు, ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు పారదర్శకంగా చేపట్టాలనీ, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఆరోగ్య బీమా పథకాన్ని ఉద్యోగులకు అనుకూలంగా మెరుగుపరచాలి, అవుట్సోర్సింగ్/కాంట్రాక్ట్ ఉద్యోగులకు సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రత్యేక సౌకర్యాలు, భద్రత కల్పించాలి అని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు తెలిపారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అవసరమైన ప్రతి ప్రజాస్వామ్య పోరాటాన్ని సంఘం ముందుండి నడిపిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం పాడేరు తాలూకా యూనిట్ మాజీ అధ్యక్షులు రొబ్బ నాగభూషణ రాజు, టి.చిరంజీవి పడాల్, రూడీ అప్పారావు,బుక్క చిట్టిబాబు ను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ గుల్లేలి సింహాద్రి, ఉపాధ్యక్షులు కృపారావు, బాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ యం. సూర్యనారాయణ, జిల్లా ట్రెజర్ జి. సుబ్రహ్మణ్యం, జిల్లా మహిళా విభాగం చైర్మన్ శ్రీమతి పై. సింహాచలం, పాడేరు సిటీ యూనిట్ అధ్యక్షులు కే. సుబ్రహ్మణ్యం కార్యదర్శి జి ప్రసాద్, తదితర కార్యవర్గ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### జలగలగెడ్డ పీవిటిజె ఆదివాసీలపై దాడులకు నిరసనగా

## పాడేరు ఐటిడిఏ వద్ద రిలే నిరాహార దీక్షలు

**పాడేరు,మార్చి10, ప్రభాతవార్త:**



అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని జలగలగెడ్డ గ్రామానికి ప్రభుత్వం సుమారు రూ.90 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ, కొర్రుబయలు గ్రామానికి చెందిన గిరిజనేతరులు రహదారి నిర్మాణాన్ని అడ్డుకుంటూ జలగలగెడ్డ పీవిటీజీ ఆదివాసీలపై దాడులకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ ఘటనపై ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆవేదన చెందారు. దాడి జరిగిన తరువాత కూడా పోలీసుల నుండి సరైన స్పందన లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదే విషయమై చింతపల్లి తహసీల్దార్ రహదారి నిర్మాణానికి ఎటువంటి అభ్యంతరం లేదని అధికారికంగా అండర్స్మెంట్ ఇచ్చారు. అలాగే రహదారి నిర్మాణానికి ఎవరైనా అడ్డుపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కూడా తెలిపారు. అయినప్పటికీ కొర్రుబయలు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రహదారి మార్గాన్ని మూసివేయడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 50-60 సంవత్సరాలుగా నడక మార్గంగా ఉన్న ఈ దారిని అక్రమంగా మూసివేయడంతో జలగలగెడ్డ గ్రామస్థులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పాఠశాలకు వెళ్లాల్సిన చిన్న పిల్లలు కూడా ప్రాణభయంతో బడికి వెళ్లలేక తల్లిదండ్రులతో కలిసి పాడేరు ఐటిడిఏ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలో ఉన్నారు. కటిక చలిలో కూడా చిన్న పిల్లలతో కలిసి తల్లిదండ్రులు రెండవ రోజు కూడా దీక్ష కొనసాగిస్తున్నారు. అలాగే జలగలగెడ్డ గ్రామస్థులపై దాడులు జరుగుతాయని ముందుగానే చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక ఎస్ఐ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. దాడి జరిగిన తరువాత కూడా స్పందన లేకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తుందన్నారు. ఇది ఇలా ఉండగా రోడ్డు నిర్మించవలసిన గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు మొన్న 4 వ తేదీన జిల్లా కలక్టర్ మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి తో శంకుస్థాపన చేయబోతున్నామని చెప్పినటువంటి ఈ అధికారులు ఇప్పుడేమో ఆ రోడ్డుకి ఫారెస్ట్ అనుమతులు లేదు అని చెప్పటంలో అంతర్యం ఏమిటి అని ప్రశ్నిస్తున్నాం. ఇవన్నీ పరిశీలిస్తే ఇటు రెవిన్యూ తహసీల్దార్ అటు పోలీష్, ఇంజినింగ్ గిరిజనేతరులతో కుమ్మకై మాతో ఆటలు ఆడుకుంటున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి జలగలగెడ్డ గ్రామస్థులు ప్రభుత్వం మరియు పోలీసు శాఖను కోరుతూ క్రింది డిమాండ్లు చేస్తున్నారు: జలగలగెడ్డ పీ వి టి జి ఆదివాసీలపై దాడికి పాల్పడిన గిరిజనేతరులు గూడూరు కిషోర్,పండు లపై తక్షణమే అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి.మరియు దాడికి పాల్పడిన ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ వారు డిమాండ్ చేసారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడతామని దండకారణ్య విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు కె.కొత్తయ్య కార్యదర్శి మనోజ్,డి ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షుడు నన్ని జాన్, జలగలగెడ్డ గ్రామస్థులు హెచ్చరించారు.కార్యక్రమానికి గొండ్వాన దండకారణ్య పార్టీ,ఆదివాసీ సేన,ఆదివాసి కూవి సంఘం, కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు వంతల సుబ్బారావ్, చింతపల్లి మాజీ ఎంపీపీ బాబురావు,భాస్కర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాకి చిక్కిన మందుబాబులు.. కేసు నమోదు.!

**(నక్కపల్లి ,ప్రభాతవార్త )**

నక్కపల్లి సర్కిల్ పరిధిలో జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో డ్రోన్ సర్వలైన్స్ ద్వారా సర్వే నిర్వహించారు ఈ మేరకు ఆరుబయట మద్యం సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు ఈ ముగ్గురు వ్యక్తులు పట్ల కేసు నమోదు చేశారు. ఎస్సై సన్నీ బాబు, మల్లేశ్వరరావు, మహిళా ఎస్సై సాహిబా అంజుమ్ ,కానిస్టేబుల్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.





## వైయస్సార్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మెరకముడిదాం, మార్చి 10, ప్రభాతవార్త

మండలములో 12న గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ పార్టీ ఈ కార్యక్రమంలో పార్టీ జండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయి కావున మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, వైస్సార్సీపీ కుటుంబసభ్యులు, గ్రామ కమిటీలో ఉన్న ప్రతిఒక్కరూ, వైస్సార్సీపీ సోషల్ మీడియా వైయస్సార్ పార్టీ సైనికులు, అభిమానులు అందరూ పాల్గొంటారని మండల వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు, చీపురుపల్లి వైఎస్సార్ పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్ల విశ్వేశ్వరరావు (వెంకట్రావు) తెలిపారు.

## కొట్టాం కోటమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



శృంగవరపుకోట,మార్చి10, ప్రభాతవార్త

మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన కొట్టాం కోటమ్మ తల్లి అమ్మవారి సిరిమానోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం అమ్మవారిని దర్శించు కున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీకు ఆలయఅర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారుఅనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం జరగనున్న సిరిమానోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కురుపాం పాఠశాలకు బీరువా వితరణ



కురుపాం, మార్చి10 ప్రభాతవార్త

కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి పట్నాన వెంకట దుర్గా ప్రసాదరావు పాఠశాలకు బీరువా మంగళవారం అందజేశారు. 1982–83 పదవ తరగతి విద్యార్థయిన దుర్గా ప్రసాద్ ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావుకి బీరువా పాఠశాలలో అందజేశారు. భవిష్యత్‌లో కూడా పాఠశాలకు సహకరిస్తానని ఆయన తెలియజేసారు.

## కూటమి ప్రభుత్వం పశుసంవర్ధకరంగ అభివృద్ధికి కృషి



కురుపాం, మార్చి10 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం పశుసంవర్ధకరంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం కురుపాం మండలం గుమ్మ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మన్యం గోబాల సంబరం (లేగదూడల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరై లేగదూడల ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా పశుసంవర్ధక శాఖ నుంచి లభించే ఆర్థిక వనరులను పెంపొందించుకునే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే మెరుగైన జాతి పశువుల అభివృద్ధి కోసం లింగ నిర్ధారిత ఇంజెక్షన్‌ను కేవలం రూ.150కే అందుబాటులో ఉంచామని, ప్రతి రైతు సేవా కేంద్రంలో ఈ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎస్. మన్మధరావు మాట్లాడుతూ పశువులకు ప్రభుత్వం రాయితీతో పశు బీమా పథకం అమలు చేస్తున్నదని, అలాగే పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా అందజేస్తున్నామని చెప్పారు. ప్రతి పాడి రైతు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లేగదూడల పాడి రైతులకు బహుమతులు అందజేశారు. అలాగే పశు బీమా నష్టపరిహారం చెక్కులను రైతులకు అందజేసి, సబ్సిడీ దాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులుడాక్టర్ శైలజ, గుమ్మలక్ష్మీపురం పశు వైద్యాధికారి,శాఖ సిబ్బంది, కూటమి నాయకులు రంజిత్ కుమార్, వెంపటాపు భారతి, కొండయ్య స్థానిక ప్రజాప్రతినిధులు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ జి.రామ్ జి పేరు మార్పు పోస్టల్ విడుదల

బాడంగి, ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఉపాధి హామీ సంబంధించి వికసిత్ భారత్ జి.రామ్ జి పేరు మార్పు పోస్టల్ విడుదల చేయడం జరిగినది ప్రతి వేతన దారుణకు సంవత్సరానికి 125 రోజులు పని కల్పన ధ్యేయంగా అదేవిధంగా పని పూర్తయిన 15 రోజులలోపు వారి ఎకౌంట్లో నగదు జమ కాపడుతుందని తెలియజేయడం జరిగినది. అదేవిధంగా జాబ్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా అందించలేక పోతే నిరుద్యోగ భృతి చెల్లించే విధంగా చర్యలు ఉంటాయని ఈ కార్యక్రమంలో తెలియజేయడం జరిగినది. మండల పరిషత్ అధ్యక్షులు యజ్జల లక్ష్మి వారు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు 1 శ్రీ పాలవలస గౌరి, ఉపాధి హామీ ఎపిఓ వారు పాల్గొనడం జరిగినది.

## విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి : జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



కురుపాం, మార్చి10 ప్రభాతవార్త

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జియ్యమ్మవలస మండలంలోని పి.టి.మండ, టి.కె.జమ్మూ గ్రామాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాల బాలికల పాఠశాలలను మంగళవారం జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో అందుతున్న విద్యా బోధన, వసతులను పరిశీలించారు. తనిఖీలో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, వారికి అందుతున్న భోజన నాణ్యత, విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాకినాడలో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్రస్థాయి సమావేశం నేడు



నెల్లిమర్ల, మార్చి 10, ప్రభాతవార్త

కాకినాడ సూర్య కళామందిర్‌లో ఈ నెల 11న జరుగు నున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశానికి తరలిరావాలని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. నెల్లిమర్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లా డారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు. మాజీ శాసనసభ్యులు టీ.జే.ఆర్.సుధాకర్ బాబు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్ కొమ్మూరు కనకారావుల ఆధ్వర్యంలో కాకినాడ పట్టణంలో శ్రీ సూర్య కళామందిర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రస్థాయి కార్యవర్గ ప్రతినిధులతో పాటు అన్ని జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని రేగాన శ్రీనివాసరావు కోరారు.



## నెమలాంలో గ్రామదేవత దర్శించుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే

తెర్లాం, మార్చి10, ప్రభాతవార్త

మండల పరిధిలోని నెమలం, గదబవలస గ్రామాలలో జరుతున్న గ్రామ దేవత ఉత్సవాలలో మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌విఎస్ కె.రంగారావు (బేబీనాయన) పాల్గొనిభక్తి శ్రద్దలలో పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మూ నాయుడు, మండల నాయకులు, పాల్గొన్నారు.

## హోటల్స్ రెస్టారెంట్స్ పరిశుభ్రత పరిశీలన : కమీషనర్



సాలూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణ మున్సిపాల్టీ పరిధిలో ఉన్న హోటల్స్ ఇంకా రెస్టారెంట్లు అలాగే రోడ్లపై చిల్లర తిను బండ వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాల వంట గదులను మంగళవారం ఉదయం కమీషనర్ టిటి రత్నకుమార్ పరిశీలించారు. అలాగే హోటల్స్ నిర్వహి స్తున్న యజమానులు తప్పకుండా జాగ్రత్తలు పాటించి ఆహార పదార్థాలు తయారు చేస్తున్న వంటగదులు ప్రతి రోజు శుభ్రపరుచుకోవాలని సూచించారు.అంతే కాకుండా చుట్టు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని హోటల్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ శుభ్రమైన ఆహార పదార్థాలను కస్టమర్లకు అందించాలని ఆదేశించారు.ఎవరైనా ఆదేశాలను బేఖాతరు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, డీఈ బి.వి.ప్రసాద్,ఏఇ అలేఖ్ స్వామి, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## కెమిశీల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జేసీ

కొమరాడ, మార్చి 10 ప్రభాతవార్త

పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం కొమరాడ మండలంలోని కెమిశీల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులు, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థుల చదువుపై ఆసక్తిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వద్దకు వెళ్ళి రాస్తున్న నోట్ పుస్తకాలను పరిశీలించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా స్థాయిని పరీక్షించారు. అనంతరం పాఠశాల హాజరు పట్టికలు, స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థులకు అందుతున్న మెనూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంతాన లక్ష్మి దీవెనలు ప్రజలందరి పైన ఉండాలి

### జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షులు వలిరెడ్డి



చీపురుపల్లి మార్చి 10, ప్రభాతవార్త

చీపురుపల్లి పట్టణం నడిబొడ్డున వెలసిన శ్రీ శ్రీ శ్రీ శీతలాదేవి (సంతాన లక్ష్మి) అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరూ పైన ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలే రెడ్డి శ్రీనివాస నాయుడు ఆకాంక్షించారు. మంగళవారం 42వ జాతర సందర్భంగా నిర్వాహకులు ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. వైస్సార్సీపీ నాయకులు రేవల్ల సత్తిబాబు, కర్రోతు ప్రసాద్, ప్రభాత్ కుమార్, ప్రముఖ వ్యాపార వేత్త అందవరపు గోవింద, రేవల్ల సత్యం, రామ గురువులు, డబ్బాడ ఆనంద్, వెంకీ, చక్రి, తో కలిసి అమ్మవారికి ఆలయ అర్చకులుతో ప్రత్యేక పూజలు చేసిన అంతర ఆలయ కమిటీ వారు కండువా వేసి సత్కరించారు, అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ(సంతాన లక్ష్మి) అమ్మవారు మహిమగల అమ్మవారు అని కోరన కోరికలు తీర్చే చల్లని తల్లి అని అన్నారు. సంతాన లక్ష్మి దేవతను ఇతర లక్ష్మీ అవతారాల కంటే చాలా భిన్నంగా చిత్రీకరించారు అన్నారు. సంతాన లక్ష్మీ స్తోత్రాన్ని స్వచ్ఛమైన హృదయంతో జపించడం ద్వారా, దేవతను సులభంగా శాంతింపజేసి దేవత అనుగ్రహాన్ని పొందవచ్చు అన్నారు. సంతాన లక్ష్మి అమ్మవారు దయ కరుణ కటాక్షం చల్లని దీవెనలు ప్రజలు అందరిపై ఉండాలని కోరుకొన్నారని అన్నారు.

## ఘనంగా గావు పండగ..



చీపురుపల్లి మార్చి 10 ప్రభాతవార్త

చీపురుపల్లి మండలం రావివలస గ్రామంలో మంగళవారం యాదవ కులస్తుల కులదైవమైన అమ్మవారిని దర్శించుకుంటూ సుమారు 70 కుటుంబాలు వారు గావు పండగను ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్తుల పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు బంధువులతో రాయవలస గ్రామం కిటకిటలాడింది. ప్రత్యేకించి అమ్మవారి పూజలలో భాగంగా తప్పుడు గుళ్ళు ఇతర కార్యక్రమాలు నిర్వహణతో పాటు పూజలు కూడా ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలతో పాటు బంద్ వర్గాలు పాల్గొని గావు పండగను విజయవంతం చేశారు.



## నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి..

చీపురుపల్లి మార్చి 10, ప్రభాతవార్త

ఇంటి యజమాని నిర్లక్ష్యం కారణంగా చీపురుపల్లి పట్టణంలో మంగళవారం నాడు జరిగిన ప్రమాదంలో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసింది. చీపురుపల్లి పట్టణంలోని మెట్ట కాలనీలో నివాసముంటున్న బూర గంగులు (35) అనే రోజువారి కూలీ కుటుంబం పోషణ కోసం యధావిధిగా మంగళవారం నాడు కూలి పనికి వెళ్ళాడు. పట్టణానికి చెందిన సూరు జగన్మోహన్రావు అనే ఇంటి యజమాని పాత ఇంటి పనులు జరిపిస్తున్న నేపథ్యంలో కూలీగా అక్కడ పనిచేస్తుండగా అకస్మాత్తుగా గోడకూలి గంగులు అక్కడికక్కడే మృతి చెందాడు. పాత ఇంటి గోడలు తొలగిస్తే నేపథ్యంలో సంబంధిత యజమాని కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడం వలన ప్రమాదం జరిగి పో నిండు ప్రాణం బలి కావలసి వచ్చింది అంటూ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. మృతుడు గంగులకి భార్య భాగ్యలక్ష్మి తో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఒక మగపిల్లాడు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా దేవరపల్లి గ్రామానికి చెందిన మృతుడు ఐదేళ్ల క్రితం జీవనోపాధి కొరకు చీపురుపల్లి పట్టణంలోని మెట్ట కాలనీ చేరుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. రోజువారీ కూలి బ్రతుకుతూ జీవనం కొనసాగిస్తున్న తమకు ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో తమ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందంటూ మృతునికి బంధువులు రోదిస్తున్నారు. పాత ఇంటి నిర్మాణం తొలగించి కొత్త పనులు చేపడుతున్న నేపథ్యంలో తీసుకోవలసిన కనీస రక్షణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. సంబంధిత పంచాయతీ అధికారుల నుండి కూడా అనుమతులు లేకుండానే ఇంటి నిర్మాణం పనులు చేపట్టడం వలన ప్రమాదం సంబంధించిందని పలువురు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం స్థానిక అధికార పార్టీ నాయకులు కొంతమంది బాధిత కుటుంబంతోపాటు ఇంటి యజమానితో చర్చలు జరిపే ప్రయత్నం చేశారు. చీపురుపల్లి పోలీస్ స్టేషన్ వద్ద చర్చలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్తులకి ఇంటి యాజమాన్యంలకు వాగ్వేదం జరగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చీపురుపల్లి ఎస్సై సిబ్బందితో చేరుకుని సెటిల్మెంట్లు బయట చేసుకోండి బాధితులు తరపున కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితుల తరపున వచ్చిన గ్రామస్తులంతా సద్దుమణి నేపధ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చీపురుపల్లి పోలీసులు వివరించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరపాలంటూ పలమూరు కోరుతున్నారు.

## కురుపాంలో ఘనంగా ఏపీఎన్జీవో వ్యవస్థాపకుడు 105వ జయంతి వేడుకలు

కురుపాం, మార్చి10 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపిఎన్‌జిఓ) వ్యవస్థాపకులు, అమరజీవి ఆమనగంటి రాములు 105వ జయంతి వేడుకలను కురుపాం తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగంటి రాములుచిత్రపటానికి పూల మాలలు వేసి సంఘ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఉద్యోగుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలను, సంఘం బలోపేతానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కురుపాం తాలూకా అధ్యక్షులు ఎస్.ఎస్. ప్రకాష్, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.సంతోష్, వైస్ ప్రెసిడెంట్లు ఏ.మురళీకృష్ణ, ఏ.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ తిరుపతిరావు, తాలూకా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ సేవలు అందిస్తున్న కోడూరు మాస్టర్‌కు ఉగాది పురస్కారం



సాలూరు ఫిబ్రవరి 10 ప్రభాతవార్త

సాలూరు పట్టణంలో మూడు దశాబ్దాలుగా సేవా రంగం ఇంకా విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు.సాయి శ్రీనివాస్ కు ఉగాది స్వర్ణ నంది అవార్డు వరించింది.ఈ మేరకు ఆదర్శ కళానిలయం వారు పరాభవ నామసంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలలో విశేష కృషి చేస్తున్న వారికి ఉగాది పురస్కారాలతో సత్కరిస్తున్న కార్యక్ర మంలో భాగంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆదర్శ కళా నిలయం సంస్థ నిర్వాహకులు యం.బి.రావు తెలియజేశారు. అలాగే మార్చి 22, ప్రసాద్ ఫిలిం ల్యాబ్ బంజా రాహిల్స్ హైదరాబాద్ లో నిర్వహించే ఉగాది సాహితీ, సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని స్వర్ణ నంది అవార్డు స్వీకరించమని కార్యక్రమంనకు ఆహ్వానించారని మంగళవారం స్థానిక విలేకరులకు కోడూరు శ్రీనివాస్ తెలిపారు.అంతేకాకుండా ఆయన స్వర్ణ నంది అవార్డు పురస్కారానికి ఎంపికైనందు డాక్టర్ వాడాడ గణేశ్,ఆరిశెట్టి మోహనరావు,కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి బీమారావు,బ్యాంక్ సీఈవో బళ్ల వేణు గోపాల్,బాలబోలు రవి, గిరి.రఘు,శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

## రైతులు అందరు పండించే పంటలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి : ఏఓ అమర శివ

రామభద్రపురం, ఫిబ్రవరి 10 ప్రభాతవార్త



మండలం పరిధిలో గల తరపురం గ్రామంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రామభద్రపురం మండలం తారపురం గ్రామములో డిజిటల్ క్రాప్ సర్వే రబీ 2025–26 పంట నమోదు రైతుల జాబితా సామజిక తనిఖీ కొరకు ప్రదర్శించడం జరిగినది. రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలు మీ రైతు సేవా కేంద్రాల్లో వివరాలు చూసుకోవచ్చు మరియు ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే సవరించుకోవచ్చు అని మండల వ్యవసాయ అధికారి అమర శివ తెలిపారు. ఈ కార్యక్రమం లో బెవర సీతారాం, బెవర చిన్నారావు, రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది దీ మీనాక్షి మాధురి పాల్గొన్నారు..

## తపాలా శాఖలో బీమా కట్టండి కుటుంబానికి ఆర్థిక సాయం అందించండి

### 15 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేసిన పోస్టల్ సూపరిండెంట్ శ్రీనివాస్



దత్తిరాజేరు మార్చి 10 ప్రభాతవార్త

తపాలా శాఖలో గ్రూప్ యాక్సిడెంట్ భీమా పాలసీ చేసుకున్నట్లయితే అనుకోకుండా ప్రమాదంలో మరణించినట్లయితే బాధిత కుటుంబానికి 15 లక్షలు రూపాయలు ఆర్థిక సాయం లభిస్తుందని జిల్లా పోస్టల్ అధికారి కే శ్రీనివాస్ అన్నారు మరదాశీ మధుర గ్రామం మైన మర్రివలస గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మణరావు మరదాశీ తపాలా కార్యాలయంలో సంవత్సరానికి 755 గ్రూపు యాక్సిడెంట్ పాలసీ కట్టడంతో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కారణంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయసమావేశ మందిరం వద్ద 15 లక్షల రూపాయలు బీమా చెక్కును బాధిత కుటుంబానికి గ్రామ సర్పంచ్ పోతల రామలక్ష్మి తో కలిసి చెక్కును అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బీమా పాలసీ చేసుకున్నట్లయితే ఆ కుటుంబానికి ఎంతో సాయం చేసిన వారు అవుతారని తెలిపారు ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ అధికారి ఉపేంద్ర ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ సతీష్ సబ్ పోస్ట్ మాస్టర్ ధనుంజయ టిడిపి నాయకుడు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25

## నెల్లిమర్ల మండలాన్ని 'ఆదర్శ స్వచ్ఛ మండలం'గా తీర్చిదిద్దుదాం : ఎమ్మెల్యే లోకం నాగ మాధవి



నెల్లిమర్ల, మార్చి 10 ప్రభాతవార్త

పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని, నెల్లిమర్ల నియోజకవర్గాన్ని పారిశుధ్యంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే మన లక్ష్యమని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మంగళవారం రామతీర్థం సచివాలయం వద్ద నెల్లిమర్ల మండల పరిధిలోని గ్రామాల్లో చెత్త సేకరణ కోసం కేటాయించిన స్వచ్ఛ రథంను ఆమె జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ఫేజ్–2లో భాగంగా, గ్రామాలను "ఓడిఎఫ్ ప్లస్ కేటగిరీలోకి తీసుకు రావడమే ఈ స్వచ్ఛ రథాల ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ స్వచ్ఛ రథం ద్వారా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తారని. సేకరించిన వ్యర్థాలను మండలంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు తరలించి, అక్కడ సేంద్రీయ ఎరువు తయారీకి ఉపయోగిస్తారని వివరించారు. అలాగే నియోజకవర్గంలో ప్లాస్టిక్ వినియోగాన్ని శత శాతం నియంత్రించాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, భూగర్భ జలాలకు జరుగుతున్న నష్టాన్ని అరికట్టాలని ఎమ్మెల్యే నాగ మాధవి పిలుపునిచ్చారు. శాస్త్రీయ పద్ధతిలో చెత్త సేకరణ జరగడం వల్ల డ్రైనేజీలు పూడిపోకుండా ఉంటాయని, దీనివల్ల దోమల వ్యాప్తి తగ్గి డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు 40శాతం వరకు తగ్గే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నా యన్నారు. గతంలో చెత్త సేకరణ వాహనాలు లేక గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండేదని. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రతి పంచాయతీకి మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని అన్నారు. రామతీర్థం వంటి ఆధ్యాత్మిక క్షేత్రం ఉన్న మండలంలో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ రథం సిబ్బందికి అందించాలని సూచించారు. జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, ఏఎంసి డైరెక్టర్ ఎం.ఎం.నాయుడు, పార్టీ నాయకులు కరుమజ్జి గోవిందరావు, ఎడ్ల గోవిందరావు, అంబల్ల అప్పలనాయుడు, పతివాడ గోవిందరావు, ఎల్లంకి హరి, నవుగట్ల పైడిరాజు, అవనాపు మురళీకృష్ణ, టిడిపి నాయకుడు కోటపాటి తిరుపతిరావు,నెల్లిమర్ల ఎంపీడీవో కే రామకృష్ణ రాజు, డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్, పంచాయితీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెరగాలి : ఎంఎల్‌సి డా.సురేష్‌బాబు

నెల్లిమర్ల, మార్చి 10, ప్రభాతవార్త



ప్రతి ఒక్కరిలో భక్తి భావం, ఆధ్యాత్మిక చింతన పెరగాలని ఎమ్మెల్సీ డా.పి.వి సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) అన్నారు. తన స్వగ్రామం నెల్లిమర్ల మండలం మొయిదా గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ ఆలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుల నుంచి ఆశీర్వాదం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ రామాలయ నిర్మాణం ఆవశ్యకమని అన్నారు. ప్రజల్లో భక్తి భావం పెరిగినాడు నేర ప్రవృత్తి తగ్గుతుందని, ఆధ్యాత్మికత వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి తన సొంత స్థలంతో పాటు, భారీ స్థాయిలో విరాళం అందజేసి డా.సురేష్‌బాబు కుటుంబీకులు కీలక భూమిక పోషించారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సురేష్ బాబుకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దవల లక్ష్మణరావు, గ్రామ సర్పంచ్ అట్టాడ కృష్ణ, గ్రామ పెద్దలు అట్టాడ కనకారావు, ఎడ్ల ధర్మారావు, పైడుపునాయుడు, ఎడ్ల కృష్ణ, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## 50 శాతం రాయితీతో మామిడి రైతులకు ఫ్రూట్ కవర్లు పంపిణీ

దత్తి రాజేరు, మార్చి 10 ప్రభాతవార్త

నాణ్యమైన మామిడి పంట దిగుబడి కోసం ప్రభుత్వం 50% రాయితీ పై ఉద్యాన శాఖ ద్వారా మామిడి ఫ్రూట్ కావాలి పంపిణీ చేయడం జరుగుతుందని ఉద్యాన శాఖ అధికారి బి.దీప్తి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో ఫ్రూట్ కవర్లు వాడడం వల్ల మందులు ఖర్చు తగ్గుతుందని పురుగులు తెగుళ్ళ భారి నుండి కాయలను కాపాడుకోవచ్చు అన్నారు మామిడి పిందెలు గోలి కాయ సైజు దాటిన తర్వాత ఈ కవర్లు కట్టుకోవాలి అన్నారు వీటి ద్వారా నాణ్యమైన పంటను పొందవచ్చునని తెలిపారు ఈ పంటకు మార్కెట్లో మూడు 3 లేక ఐదు రెట్లు అధిక రేటు పలుకుతుంది మామిడి ఫ్రూట్స్ హెక్టార్‌కి 15వేలు కవర్లు కట్టుకోవాలి ఈ ఫ్రూట్ కవర్లు రాఖీ కోసం మీ రైతు సేవ కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు సంప్రదించగలరని తెలిపారు.

## సీఎం సహాయ నిధి నిరుపేదలకి వరం : గిరిజన శాఖ మంత్రి గుమ్మడి



పాచిపెంట మార్చి 10, ప్రభాతవార్త

సీఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరమని మంత్రి సంధ్యారాణి అన్నారు. వివరాల్లోకి వెళ్ళగా మండలంలో కర్రివలస పంచాయతీ గవిరమ్మపేట గ్రామానికి చెందిన పడాల గంగరాజు, కుమారుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నాడని వ్యాధి నివారణకు ఆయన మంత్రి సహాయము కోరినప్పటికీ ఆమె మానవతా దృక్పథంతో సీఎం దృష్టికి తీసుకెళ్లి సీఎం చంద్రబాబు నాయుడు సీఎం సహాయ నిధి కింద మంజూరు చేశారు. ఆ మేరకు రాష్ట్ర శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ద తీసుకెళ్లగా ఆమె సీఎం సహాయ నిధి నుండి రెండు లక్షల 51,996 రూపాయలు చెక్కును మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం ఉదయం తమ చాంబర్లో అందజేశారు. ఆర్థిక సహాయం అందినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకి, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు ఎరకయ్య గంగరాజులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు జి.యుగంధర్, ఏఎంసి డైరెక్టర్ పూసర్ల సర్ల నర్సింగరావు, కేసలీ పిఎసిఎస్ అధ్యక్షులు మజ్జరావు, కర్రివలస మాజీ సర్పంచ్ రవుతు తిరుపతిరావు, గంట భాస్కరరావు పాల్గొన్నారు.

## వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తి కనబరచాలి

గరివిడి మార్చి,10 ప్రభాత వార్త



రైతులు వాణిజ్య పంటలపై ఉత్సుకత చూపాలని గరివిడి మండల ఉద్యానవన శాఖాధికారి అనూష అన్నారు. మండలంలోని కోనూరు లో ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో ఉద్యాన మిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆమె రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. వాణిజ్య పంటల వలన మేలైన లాభాలు, మెరుగైన ప్రోత్సాహకాలు అందుతాయని ఆమె పేర్కొన్నారు. వాణిజ్య పంటలైన కొబ్బరి తదితర పంటలతో పాటు కూరగాయలు సాగుకి రైతు ఉపక్రమించాలన్నారు. వాణిజ్య పంటలకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. నీటి వసతి, విద్యుత్తు సౌకర్యం, తదితర సౌకర్యాలు సమకూర్చుతుందని ఆమె పేర్కొన్నారు. సదస్సులో కోనూరు సర్పంచ్ బూడి శ్రీరాములు నాయుడు, మాజీ సర్పంచ్ వెంపడాపు రమణ మూర్తి ,వ్యవసాయ సహాయ కులు గురాన శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

## పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తజనం



మక్కువ మార్చి 10 ప్రభాతవార్త:

శంబర గ్రామములో వేంచేసి ఉన్న ప్రముఖ ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత రాష్ట్ర ప్రభుత్వంచే రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన పోలమాంబ అమ్మవారి జాతర ఉత్సవములు ఏడవ మంగళవారం అమ్మవారి దర్శనంకు వేలాదిమంది భక్తులు దర్శించు కున్నారు. 6వ మంగళవారం గ్రహణం సందర్భంగా ఆలయ తలుపులు మూసివేసినందున, ఏడవ మంగళవారం భక్తులు అత్యధికంగా దర్శించుకున్నారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి బి శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నైదాన చిన తిరుపతి, తగు ఏర్పాట్లు చేశారు. 7 మంగళవారం సందర్భంగా నైమిశారణ్య పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, బాల బ్రహ్మానంద సరస్వతి గారిచే శ్రీదేవి భాగవతం గూర్చి ప్రవచనములు చెప్పబడినవి. ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని ఎంత భక్తిశ్రద్ధలతో ప్రవచనములు విని ఆనందించారు.

## ఎల్.కోటలో నేడు రేపు శ్రీ భద్ర మహంకాళి అమ్మవారి 42వ వార్షికోత్సవ వేడుకలు

లక్కవరపు మార్చి 10ప్రభాత వార్త

మండలంలోని ఎల్ కోట మేజర్ పంచాయతీలోని బిసి కాలనీ సమీపంలో గల గ్రామ దేవత శ్రీ భద్ర మహంకాళీ అమ్మ వారి 42వ వార్సికోత్సవం సందర్భంగా నేడు బుధవారం గురువారాలలో తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీ గౌరి సేవా సంగం అధ్యక్ష కార్యదర్సులు తెలిపారు. ఈ తీర్థం సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేస్తున్నామని తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు డాన్స్ బేబీ డాన్స్ కోలాటం బారి బాణా సంచా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే తొలి రోజు అమ్మ వారి ఘటాల ఊరేగింపు భారి అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

